


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 149, పేజీలు - 08

బుధవారం, అక్టోబర్ 2, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

### కులతత్వంతో దేశభక్తిని అణిచివేసేందుకు

## కాంగ్రెస్ కుయుక్తులు

### ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కులాలు, మతాల ప్రాతిపదికన ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా పల్వాల్ లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు. కీలకమైన చట్టాలను , అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకుంటూ, దేశ సంక్షేమం కంటే తన స్వంత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే పార్టీ కాంగ్రెస్‌ని అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ విభజన వ్యూహాలను తిరస్కరించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీని అంతర్గత విభేదాలు పట్టిపీడిస్తున్నాయని మోదీ విమర్శించారు. దళితులు, వెనుకబడిన తరగతులు, సమాజంలోని అణగారిన వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడంలో వైఫల్యం కారణంగా హస్తం నేతల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ఎన్నికల టిక్కెట్ల పంపిణీపై హర్యానాలోని ఇద్దరు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు కుమారి సెల్జా, భూపిందర్ సింగ్ హూడాల మధ్య జరుగుతున్న విభేదాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ర్యాలీ సందర్భంగా, మోడీ హర్యానాలో కాంగ్రెస్ పార్టీని పీడిస్తున్న అంతర్గత విభేదాలను కూడా స్పృశించారు, దళితులు, వెనుకబడిన తరగతులు మరియు సమాజంలోని అణగారిన వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం

2లో..

# ఉద్దేశం మంచిదే అయినా దూకుడే అసలు సమస్య

## - హైడ్రా డ్యామేజీని రేవంత్ ఎలా కవర్ చేసుకుంటారు.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలనలో తన మార్క్ చూపించాలని అనుకున్నారు. తెలంగాణను పట్టి పీడిస్తున్న సమస్యలను చిటికెలో పరిష్కరించేయాలనుకన్నారు. కానీ దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం చూపించడం తేలిక కాదు. ఇన్నేళ్లుగా ప్రభుత్వాలు ఏమీ చేయలేకపోయిన వాటిని తాను ఇట్టే చేసేయాలనుకుని చేసిన పనులు వికటిస్తున్నాయి. గత ప్రభుత్వాల తప్పులన్నీ మీదపడిపోతున్నాయి. దశాబ్దాలుగా మూసీని మురిక కాలువ చేసి ఇందులో కాలనీలు కట్టేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. పైగా పట్టాలిచ్చారు. చెరువుల్ని మూసేసి ఆపార్టుమెంట్లు కట్టేసినా అదే పరిస్థితి ఇప్పుడు అదంతా తాను సరి చేయాలని రేవంత్ రెడీ అయ్యారు. ఆయన ఉద్దేశం మంచిదే కానీ మూలాలు అన్వేషించకుండా కూల్చేస్తే పనైపోతుందని అనుకోవడంతోనే సమస్య వచ్చింది.

**- ముందుగా ఆక్రమణ దారులను మానసికంగా రెడీ చేయాలి కదా**

హైడ్రా విషయంలో ప్రజలంతా పానిక్‌కు గురవుతున్నారు. దీనికి కారణం రెండు నెలలో హైడ్రా హైదరాబాద్‌ను కూల్చి వేసిందన్నట్లుగా ప్రచారం జరగడమే. ప్రజల్ని ప్రిపేర్ చేయకపోవడం వల్ల ఎక్కవ సమస్యలు వస్తున్నాయి. హైడ్రా ఏర్పాటును హడావుడిగా చేశారు. కేబినెట్ లో నిర్ణయం తీసుకుని ఏర్పాటు చేసి కూల్చివేతలు ప్రారంభించేశారు. ఇంకా అసెంబ్లీలో చట్టబద్ధం చేయలేదు. అసెంబ్లీలో దీనిపై విస్తృతంగా చర్చ పెట్టాల్సినంత పెద్ద విషయం ఇది. ప్రజల ఆమోదం లభించేలా తన వాదనను ప్రభుత్వం వినిపించిన తర్వాత బాధితులకు న్యాయం చేసి ఆ తర్వాత కూల్చివేతలు చేపట్టాల్సి ఉంది. అంటే మెరుగైన హైదరాబాద్ కోసం కూల్చివేతలు తప్పవు అని అందరికీ నచ్చ చెప్పి కూల్చివేతలు చేసినట్లయితే వ్యతిరేకత కనిపించేది కాదు. పైగా ప్రజల నుంచి మద్దతు వచ్చేది.

**- మూసి మార్కింగులతో మరింత గందరగోళం**

మూసి విషయంలో కూడా ప్రభుత్వం చాలా దూకుడుగా వ్యవహరించింది. హైదరాబాద్‌లో మూసి అంటే మురికి కాలువ. మురికి కాలువగా మారిపోయిన మూసిలో అంతా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, నిరుపేదలే చిన్న చిన్న ఇళ్లు కట్టుకుని ఉంటారు. దశాబ్దాల నుంచి మూసిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. మరి వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చేస్తాం వెళ్లిపొమ్మంటే ఎలా వెళ్తారు. తప్పనిసరి అనుకుంటే వారికి ఆ పరిస్థితి కల్పించేలా మెల్లగా చర్యలు తీసుకోవాలి . కనీసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు చర్చలు జరిపి అందరికీ న్యాయం చేసి అక్కడి నుంచి తరలిస్తేనే అడ్డంకులు లేకుండా ఉంటాయి. కానీ రాత్రికి రాత్రి మార్కింగులు చేయడం వల్ల అలదడి రేగింది.

**- ప్రభుత్వానికి బాధ్యతలూ ఉంటాయి**

కూల్చివేతల్లో నష్టపోతున్న వారికి న్యాయం చేయాల్సింది ప్రభుత్వమే. ఎందుకంటే వారు కూల్చివేసిన ఆస్తికి సంబంధించి ప్రభుత్వం అన్ని రకాల పన్నులూ వసూలు చేస్తోంది . రిజిస్ట్రేషన్లు కూడా చేసింది.



మరి ఇప్పుడు కూల్చివేయడం ఎలా న్యాయం.? అవి ప్రభుత్వ స్థలాలే.. నదులే అయినా వారికి పరోక్షంగా అయినా

2లో..

### వారి గూడును కూల్చేశారు..

## కలలను చిదిమేశారు

### - కేటీఆర్ ఎమోషనల్ ట్వీట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలే లక్ష్యంగా హైడ్రా బుల్డోజర్లు దండయాత్ర చేయగా అందులో చాలా మంది సామాన్యులకు సంబంధించిన నివాసాలు, జీవనాధారం కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్లు కూల్చేశారు. కాగా ఇప్పుడు మూసీ ప్రక్షాళన కోసం పరివాహక ప్రాంతాల్లోనూ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఈ కూల్చివేతలపై బీఆర్ఎస్ తన గళాన్ని గట్టిగా వినిపిస్తోంది. బాధితులకు అండగా నిలిచేందుకు గులాబీ నేతలంతా రోడ్డెక్కారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ సహా నేతలంతా బాధితులను కలుస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం (అక్టోబర్ 01న) రోజున కూడా కేటీఆర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాధితులకు ధైర్యం చెప్పటమే కాకుండా ట్విట్టర్ వేదికగా కూడా ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో ఎండగడుతున్నాయి. ఈ క్రమంలోనే చిన్నారుల ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశారు కేటీఆర్. "వారి గూడుని కూల్చేశారు! వారి కలలను చిదిమేశారు! ఆ కూలిన ఇంటి శిథిలాల్లో వారి జీవితాలను వెత్తుకుంటున్నారు! మీ మంత్రులను వచ్చి చెప్పమనండి వీళ్లు కూడా డబ్బులు తీసుకున్నారని!

2లో..

### లడ్డూపై సీబీఐ దర్యాప్తుకు

## సర్కార్ ఓకే

### - సిట్ విచారణకు బ్రేక్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో తిరుమల లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణల నేపథ్యంలో టీటీడీ ఫిర్యాదు మేరకు జరుగుతున్న సిట్ దర్యాప్తుకు బ్రేక్ పడింది. ఈ మేరకు తిరుమలలో పర్యటించిన డీజీపీ ద్వారకా తిరుమలరావు కీలక ప్రకటన చేశారు. సిట్ దర్యాప్తును నిలిపేస్తున్నట్లు తెలిపిన డీజీపీ అందుకు గల కారణాలను కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎల్లుండి సుప్రీంకోర్టులో జరిగే విచారణ కూడా కీలకంగా మారిపోయింది. తిరుమల లడ్డూ విషయంలో రాజకీయాలు చేయొద్దంటూ సీఎం చంద్రబాబుకు సుప్రీంకోర్టు నేరుగా అంటించిన చురకల ప్రభావం సిట్ దర్యాప్తుపైనా పడింది. చంద్రబాబు వ్యాఖ్యల తర్వాత సిట్ దర్యాప్తు ప్రారంభం కావడంపై సుప్రీంకోర్టు స్వయంగా అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ల డిమాండ్ మేరకు లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో

2లో..

### సొంతూరిలోనే

## ఉద్యోగం చేసుకోవచ్చు

### - డీఎస్సీ నోటిఫికేషన్‌పైనా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా ఈ ప్రాంతంలో 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పారు. కర్నూలు జిల్లా పుచ్చకాయలమడలో పెన్షన్ల పంపిణీ అనంతరం నిర్వహించిన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. వర్క్ ఫ్రం హోంకు శ్రీకారం చుట్టాలనేదే తన ఆలోచన అని గ్రామాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా సొంతూరిలోనే ఉండి ఉద్యోగం చేసుకోవచ్చని చెప్పారు. 'కర్నూలు నుంచి బళ్లారికి జాతీయ రహదారి తెస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం. మెరుగైన మద్యం పాలసీ తీసుకొచ్చాం. రూ.100 కోట్లతో మద్యం మాన్పించే కార్యక్రమం చేపడతాం. ఓర్వకల్లులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. దీపావళి రోజు నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తాం. వాలంటీర్లు లేకపోయినా పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. వాలంటీర్లను ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాం.' అని చంద్రబాబు తెలిపారు.

**- ఆ విధ్వంసం అంతా ఇంతా కాదు**



గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదని చంద్రబాబు మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మీటింగ్స్ అంటే పరదాలు కట్టేవారని సీఎం మీటింగ్ అంటేనే ప్రజలకు నరకం కనిపించేదని అన్నారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛను రూ.4 వేలకు పెంచాం. ప్రతి నెలా ఒకటో తేదీనే అధికారులు ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. పింఛన్ల పంపిణీ శాశ్వతంగా కొనసాగిస్తాం. ఒకప్పుడు ఉద్యోగులకు సరిగ్గా జీతాలు కూడా వచ్చేవి కావు. ఇప్పుడు సకాలంలో జీతాలు అందిస్తున్నాం. ఎన్నికల్లో ఎంతో చైతన్యంతో ఓటు వేశారు. జగన్ వెళ్తూ వెళ్తూ ఖజానా ఖాళీ చేసి వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులున్నా హామీలను నెరవేరుస్తున్నాం.

2లో..

## జమ్మూ కాశ్మీర్ లో ప్రశాంతంగా ముగిసిన మూడో దశ పోలింగ్

### - 69 శాతం పోలింగ్ నమోదు




**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్)** జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం మూడో దశ పోలింగ్ పూర్తయింది. సాయంత్రం 6 గంటల వరకు 69 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలుస్తోంది. మొత్తం 90 సీట్లు ఉన్న జమ్మూకాశ్మీర్ మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించారు. మొదటి దశ సెప్టెంబర్ 18న జరిగింది. తొలి దఫాలో 65.4 శాతం పోలింగ్ నమోదు అయింది. ఇక రెండో దశ సెప్టెంబర్ 25 జరిగింది. రెండో దఫాలో 57.31 ఓటింగ్ శాతం నమోదు అయింది. చివరి దశ మంగళవారం జరిగింది. జమ్మూ కాశ్మీర్‌లోని ఏడు జిల్లాల్లోని 40 అసెంబ్లీ సెగ్మెంట్లలో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిసింది. మూడో దశలో 415 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రులు తారా చంద్, ముజఫర్ బేగ్, పలువురు మాజీ మంత్రులు పోటీలో ఉన్నారు. ఉధంపూర్ జిల్లాలో అత్యధికంగా 72.91% పోలింగ్ నమోదు కాగా. సాంబా 72.41, కథువా 70.53, జమ్ము 66.79, బండిపోరా 63.33, కుప్వారా 62.76, బారాముల్లా 55.73 శాతం పోలింగ్ నమోదైంది.

2లో..

## వరద సాయం ప్రకటించిన కేంద్రం

### - తెలుగు రాష్ట్రాలకు ఎంతంటే.?




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా ఇటీవల సంభవించిన వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన క్రమంలో ప్రభావిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు రూ.5,858.60 కోట్లు విడుదల చేస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ వాటాలో భాగంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్డీఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్డీఆర్ఎఫ్) నుంచి 14 రాష్ట్రాలకు హోంశాఖ నిధులు మంజూరు చేసింది. ఏపీకి రూ.1,063 కోట్లు, తెలంగాణకు రూ.416.80 కోట్లు కేటాయించింది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,492 కోట్ల వరద సాయం ప్రకటించింది. ఏపీలోని విజయవాడ, ఎన్టీఆర్, తూ.గో, ప.గో సహా కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలతో తీవ్ర నష్టం సంభవించింది. విజయవాడలో బుడమేరు పొంగడంతో నగరం అతలాకుతలమైంది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అయితే,

2లో..

### అక్కను ఇంతగా అవమానిస్తారా?

## వదిలిపెట్టను

### - ఎంపీ రఘునందన్ రావు వార్నింగ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఓ అధికారిక కార్యక్రమంలో కొండ సురేఖ రఘునందన్ రావు మధ్య జరిగిన ఓ చిన్న సన్నివేశాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా అసభ్యకర రీతిలో ప్రచారం చేయడం పైన సోమవారం కొండ సురేఖ కన్నీటి పర్యంతమైన విషయం తెలిసిందే. ఇక ఈ వ్యవహారంలో మంగళవారం బిజెపి ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. అధికారిక కార్యక్రమంలో ఒక తమ్ముడిగా మంత్రి కొండ సురేఖకు తాను చేనేత నూలుతో చేసిన కండువా కప్పేనని దానిని బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి హరీష్ రావు తమ పార్టీ నేతలను కంట్రోల్ చేయాలని బిజెపి ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. మహిళలపైన అసభ్యమైన పోస్టులు పెట్టి తప్పుడు ప్రచారం చేసే వారి పైన కేసులు పెట్టి కోర్టుకు ఈడుస్తామని హెచ్చరించారు.ప్రతి ఒక్కడి ఇంట్లో తల్లి, అక్క, చెల్లి ఇలా ఎన్నో అనుబంధాలు ఉంటాయని,

2లో..

### హైదరాబాద్‌లో

## డీజేలపై నిషేధం

### - నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో విపరీతమైన శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేలా పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఊరేగింపులు, వేడుకల సందర్భంగా శబ్ధ కాలుష్యానికి కారణమవుతోన్న డీజేలపై నిషేధం విధించింది. ఈ మేరకు నగర సీపీ సీవీ ఆనంద్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని డయల్ 100కి ఫిర్యాదులు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డీజేల అంశంపై ఇటీవల బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ



సమీక్షలో బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, పాషాఖాద్రీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, రాచకొండ సీపీ సుధీర్ బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ సీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

2లో..

## అర్గుల్ ఏబీపీఎం ఆఫీజొద్దీన్ సేవలు మరువలేనివి



ఆర్మూర్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ జిరాయత్ నగర్ లోని సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని అర్గుల్ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లో గత 39 సంవత్సరాలుగా ఏబీపీఎంగా విధులు నిర్వహిస్తున్న ఆఫీజొద్దీన్ సెప్టెంబర్ నెలలో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా యమునా గార్డెన్స్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆత్మీయ బంధువులు,మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని వారి సేవలను కొనియాడుతూ శాలువలు పూలమాలలతో ఘనంగా సన్మానించి,పోస్టల్ సిబ్బంది,బంధువులు పదవీ విరమణ పొందుతున్న అఫీజుద్దీన్ దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించి,పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తపాలా శాఖ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఏబీపీఎం ఆఫీసుద్దీన్ సేవలు తపాల శాఖలో మరువలేనివని ఏ లెటర్ ఎప్పుడు వచ్చినా పెండింగ్ ఉండేవి కావని, బ్యాగు తేవడంలో బట్వాడా పంచడంలో ఆయనకాయనే సాటి అని,సమయపాలన, అంకితభావం తాను పని చేసే వృత్తిపై గౌరవంతో ఎలాంటి పెండింగ్ ఆర్టికల్స్ ఉండకుండా పంపిణీ చేసే గుణం ఆయనకే సొంతం.39 సంవత్సరాలుగా ఎలాంటి రిమార్కులు లేకుండా నారాయణపేట్,అర్గుల్, మామిడిపల్లి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లలో ఎనలేని సేవలు అందించారని ఆయన సేవలు శ్లాగిస్తూ అభినందిస్తూ కొనియాడారు.ఈ మిగిలిన సమయాన్ని సమాజ సేవకు వినియోగించాలని కోరారు.ఈ దంపతుల శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ,సంతోషాలతో అనునిత్యం ఆనందమయంగా గడపాలని ఆకాంక్షిస్తూ బీపీఎంలు,ఏబీపీఎంలు, ఈడిడీఏల తరఫున పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీపీఎంలు రమేష్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, జగదీశ్వర్ ,ఎర్రటి శ్రీనివాస్, వెంకట్ రామ్, వెంకటేష్,వాసు, భావన, సృజన, శ్వేత, భరత్, రాజేష్, సుదర్శన్, పడాల భూషణ్, పవన్, మధుకర్, మృదుల, ఫస్లొద్దీన్, బాషీద్, గంగా కిషన్,దాత్రిక్ క్రితిక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా జిందం నరహరి వ్యవహరించారు.

## పదవి విరమణ చెందిన ఉద్యోగులకు సన్మానం



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) ప్రతి ఉద్యోగికి తమ ఉద్యోగంలో పదవి విరమణ సహజం,తమ సర్వీసు మొత్తం సహ ఉద్యోగులతో కలిసి పనిచేసి 61 సంవత్సరాలకు పదవీ విరమణ జరుగుతుంది. ఈసందర్భంగా ధర్పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నందు పదవి విరమణ చెందిన, సాధారణ బదిలీలు అయినా ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా మలేరియా అధికారి డాక్టర్. తుకారం రాథోడ్, సూపర్డెంట్ డాక్టర్.శివ శంకర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇంటికంటే ఉద్యోగంలోనే ఎక్కువ సమయం గడపడం జరుగుతుంది.పదవి విరమణ చెందిన ఫార్మసిస్ట్ కృష్ణ, పిహెచ్ఎన్ మేరీ ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలలేని సేవలు అందించి అందరి మన్ననలు పొంది పదవి విరమణ చెందిన, సాధారణ బదిలీలు అయిన ఉద్యోగులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేయడం జరిగింది. అలాగే వారు పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలు జీవించాలని కోరుతూ, వేరే చోటుకు బదిలీపై వెళ్లిన వారికి ధర్పల్లి లాగా అక్కడ కూడా అందరు ఉద్యోగులతో కలిసిమెలిసి పని చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్. సుశాంత్ రెడ్డి, డాక్టర్. స్వాతి, డాక్టర్. మౌనిక, సిబ్బంది హరినాథ్ నెహ్రూ, కృష్ణ, నారాయణ, ఆకాశ్, రాజేందర్, భూలక్ష్మి నిర్మల, ప్రకాష్ ,మీనా, నర్సమ్మ, లత, మురళి ,పద్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## లండన్ కిడ్స్ యాజమాన్యం బతుకమ్మ పండగ కార్యక్రమం



నిజామాబాద్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా నగరంలోని న్యాల్కల్ రోడ్డులో గల లండన్ కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ కార్యక్రమం సంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మౌనిక మెహెర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయ, ఆచార వ్యవహారాలు తెలిసే విధంగా బతుకమ్మ కార్యక్రమం 21 రకాల ఆకృతులతో విభిన్నంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ, రమ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## రాణిగంజ్ డిపో తరఫున 330 మందికి బస్ పాస్ పంపిణీ





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాణిగంజ్ డిపో తరఫున స్కూల్ పిల్లలకు ఉచిత బస్సు పాస్ పంపిణీ జిల్లా పరిషత్ హై స్కూల్ రాయదుర్గ మరియు మండల ప్రజా పరిషత్ ప్రైమరీ స్కూల్ రాయదుర్గ, ఈ కార్యక్రమంలో రాణిగంజ్ డిపో మేనేజర్ ఏ.శ్రీధర్ గారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు గడప ఎల్లయ్య గారి జ్ఞాపకార్థం గౌరవనీయులు గడప రమేష్ గారు రవీందర్ రెడ్డి ఏ.డి.సి సుధాకర్ రెడ్డి ఏ.డి.సి మరియు మొహమ్మద్ వారిస్ గఫూర్ ఏ.డి.సి గారి చేతుల మీదుగా 330 పిల్లలకు ఉచిత బస్ పాస్ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కె.తాజ్ బాబు, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీ బాయ్ రాణిగంజ్ డిపో తరఫున ఎస్.ధర్మేందర్ సి.ఆర్.సి, శ్రీనివాస్ వి.బి.ఓ పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సార్ మాట్లాడుతూ భారత దేశ భవిష్యత్తు మీ పై ఆధారపడి ఉంటుందని నేటి బాలలే రేపటి పౌరులని స్కూల్ పిల్లలను బాగా చదువుకోవాలని చెప్పడం జరిగింది.

# హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం

ఇచ్చారు. రెండేళ్లుగా డీజేలపై పెద్దఎత్తున నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం దీన్ని గమనించి ఆరా తీశారని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పాషాఖాద్రీ డీజేలపై నిషేధానికి మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. డీజే, సౌండ్ మిక్సర్, హై సౌండ్ ఎక్విప్‌మెంట్ పరికరాలపై నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు చెప్పారు.

**- ఇవీ నిబంధనలు**

రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకూ డీజేలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి ఉన్న ప్రాంతాల్లో తక్కువ శబ్దంతో అనుమతించనున్నారు. ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలు, కోర్టు ప్రాంగణాలకు 100 మీటర్ల దూరంలో నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. సౌండ్ సిస్టం పరిమిత స్థాయిలో అనుమతిస్తామని.. దీనికి కూడా పోలీసుల అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. అలాగే, మతపరమైన ర్యాలీల్లో బాణాసంచా నిషేధమని తెలిపారు. మతపరమైన ర్యాలీలో ఎలాంటి డీజేను ఉపయోగించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, 4 జోన్లలో సౌండ్ సిస్టం పెట్టడానికి డెసిబిల్స్ నిర్దేశించారు. జనావాసాల ప్రాంతంలో ఉదయం 55 డెసిబిల్స్‌కు మించి సౌండ్ సిస్టంలో వాడకూడదని చెప్పారు. రాత్రి వేళల్లో 45 డెసిబిల్స్‌కు మించి సౌండ్ సిస్టమ్‌లో వాడకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తామని చెప్పారు. పదే పదే రూల్స్ బ్రేక్ చేస్తే ప్రతి రోజూ రూ.5 వేల జరిమానా విధిస్తామని సీపీ వార్నింగ్ ఇచ్చారు.

## మణుగూరులో ఏజెన్సీ చట్టాలకుం తూట్లు : సోడె రవికుమార్ దొర

**అనుమతి లేని అక్రమ నిర్మాణంలో కార్పొరేట్ వ్యాపారం**

**కనుమరుగవుతున్న 1/70 చట్టం**




భద్రాద్రి బ్యూరో (ప్రశ్న న్యూస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు అక్రమ నిర్మాణాలకు, ఏజెన్సీ చట్టాల నిబంధనల ఉల్లంఘనకు కేంద్ర బిందువుగా మారిపోతుంది. సమితి సింగారం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన బహుళ అంతస్థుల నిర్మాణంలో ఏకంగా కార్పొరేట్ వ్యాపారం నిర్వహించేందుకు ఏర్పాటు జరగడం చూస్తుంటే మణుగూరులో ఏజెన్సీ, 1/59, 1/70, పెసా చట్ట నిబంధనలకు అధికారులు మంగళం




పాడుతున్నట్టుగా ఉందని జిల్లా కలెక్టర్ వెంటనే ఈ అక్రమ భవనంపై చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని ఆదివాసి నాయకుడు సోడే రవి కుమార్ దొర కోరారు. మణుగూరులో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ నిర్మాణాలపై ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేలా కొందరు ప్రజాప్రతినిధులు అండగా నిలవడం ఆశ్చర్యకరం. ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా భారీ ఎత్తున బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణాలు జరుగుతునప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక భారీ ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తోంది. సదరు అక్రమ నిర్మాణంలో ఇప్పటికే ఒక షాపింగ్ మాల్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయని, పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో గిరిజన చట్టాలను చుట్టాలుగా మార్చుకోని కొందరు ఇలా చేస్తుంటే జిల్లా యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందని ఆయన విమర్శించారు. కొందరి సహకారం కారణంగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా జరుగుతున్న అక్రమ నిర్మాణాలతో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారుతున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ఏజెన్సీ చట్టాలు పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకుడు సోడె రవి కుమార్ దొర కోరుతున్నారు.

## రేపటి నుంచి బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్** రాష్ట్రంలో బుధవారం నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు అంగన్వాడీ సిబ్బందికి వెసులుబాటు కల్పిస్తూ సర్క్యులర్ జారీ అయింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు అంగన్వాడీలో విధులు నిర్వర్తించి ఆ తర్వాత బతుకమ్మ వేడుకల్లో పాల్గొనవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## పెద్దలకు విలువ, గౌరవం ఇవ్వాలి

**నల్గొండ** వయో వృద్ధులు లేని సమాజం ఉండదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర అన్నారు . జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెద్దల దినోత్సవం జరుపుకున్నంత మాత్రాన సరిపోదని, వారికి సరైన విలువ, గౌరవాన్ని ఇచ్చినప్పుడే అది సార్థకం అవుతుందని అన్నారు. “మీరు లేని సమాజం ఊహించలేనిది. సమాజంలో మీది ఉత్కృష్ట భాగం.మీ కృషివల్లే సమాజం కొనసాగుతోంది” అని ఆయన అన్నారు. సమాజానికి ప్రతి ఒక్కరు సేవ చేసినట్లుగానే వయోవృద్ధుల సేవను సైతం మర్చిపోలేము అని తెలిపారు. కుటుంబ పెద్దలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ,వారిని గుర్తించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వయో వృద్ధుల సంక్షేమానికి సంబంధించి 2007లో వచ్చిన చట్టం కొద్దిపాటి మాత్రమే ఉపశమనం కల్పించిందని చెప్పారు. జిల్లాలో వయవృద్ధులకు సంబంధించి 280 కేసులు నమోదయాయని, వాటిని త్వరగా పరిష్కరించాలా తెలిపారు. మండల స్థాయిలో వయోవృద్ధుల కమిటీల ఏర్పాటు, వారికి చికిత్స తదితర విషయాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తుందని టర్లపారు. ఈ సందర్భంగా ఆయన వయోవృద్ధులను సన్మానించారు. వయో వృద్ధుల జిల్లా అసోసియేషన్ తరపున స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ను, అతిథులను సన్మానించారు. అడిషనల్ ఎస్ పి రాములు నాయక్,జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, డిఆర్ డి ఏ అడిషనల్ పి డి శారద,వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున రావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**సిద్దిపేట** ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట మున్సిపాలిటీలోని రంగధాంపల్లి పరిధిలో గల మారుతీ నగర్ వెంచర్ లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొబైల్ ఫోన్ లో ఎల్ఆర్ఎస్ యాప్ ద్వారా అప్లోడ్ ప్రక్రియ గుర్చి జిల్లా కలెక్టర్ అడగ్గా మారుతీ నగర్ వెంచర్ గల 175 స్క్వేర్ యార్డు విస్తీర్ణం గల ఒక ఓపెన్ ప్లాట్ అక్కడ లోకేషన్ తో అప్లోడ్ చేసే విధానం గుర్చి క్లుప్తంగా అధికారులు వివరించారు.

స్టేప్ బై స్టేప్ కన్వర్షన్, అప్లికేషన్ చార్జీల గుర్చి అడిగారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పలు విభాగాలు పూర్తి చేయడానికి సర్వర్ ప్రాబ్లమ్, ఓపెన్ ప్లాట్ ఓనర్ సరిగ్గా రెస్పాన్స్ ఇవ్వకపోవడం, ఇతరత్రా ఇబ్బందుల వలన ఆలస్యం అవుతుందని, లోకేషన్ లోనే పోటో తిసి అప్లోడ్ చేస్తేనే యాప్ లో అప్లోడ్ అవుతుందని కలెక్టర్ కి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిద్దిపేట మున్సిపాలిటీ లో సూమారు 10 వెంచర్లలో దాదాపు 32000 ప్లాట్స్ అప్లికేషన్లు ఉన్నాయని సిబ్బంది కోరత వలన ఆలస్యం అవుతుంది కావున మ్యాన్ పవర్ పెంచి వారికి ఎల్ఆర్ఎస్ ట్రెనింగ్ ఇచ్చి ప్రక్రియను వేగవంతం చేయడానికి నా తరపున నుండి ఎలాంటి సహకారానికైన సిద్ధం అని తెలిపారు. అలాగే ఇరిగేషన్, రెవెన్యూ అదికారులు ఎల్ఆర్ఎస్ యాప్ లో చేసే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అందరు అదికారులు సమన్వయంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు.

## కులతత్వంతో దేశభక్తిని అణిచివేసేందుకు కాంగ్రెస్ కుయుక్తులు

వహించడంలో వైఫల్యం కారణంగా దాని సభ్యులలో అసంతృప్తి ఏర్పడిందని సూచించారు. ఎన్నికల టిక్కెట్ల పంపిణీపై హర్యానాలోని ఇద్దరు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు కుమారి సెల్జా, భూపిందర్ సింగ్ హూడాల మధ్య జరుగుతున్న విభేదాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ అంతర్గత పోరు, మోడీ ప్రకారం, పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్నదని చెప్పుకుంటున్న వర్గాల నుండి మరింత దూరం చేస్తుంది. బీజేపీకి రాష్ట్ర ప్రజల నుంచి లభిస్తున్న అఖండ మద్దతు కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడటం లేదని ప్రధాని మోదీ అన్నారు. చాలా కాలంగా హర్యానాలోని అట్టడుగు రాజకీయాలను సాధారణ కార్యకర్తగా గమనించాను. ఇటీవల, ఎన్నికల ప్రచారాల కోసం హర్యానాలోని వివిధ ప్రాంతాలను సందర్శించడానికి ,ప్రజలను కలిసే అవకాశం నాకు లభించిందన్నారు. కాంగ్రెస్ వ్యూహం జాతీయ ఐక్యత భావాన్ని విచ్ఛిన్నం చేయడంపై ఆధారపడి ఉందని ఆరోపించారు. ఇది వారి ఎన్నికల విజయాన్ని మరింత సవాలుగా మారుస్తుందన్నారు. కాంగ్రెస్ విభజన వ్యూహాలను తిరస్కరించాలని ఓటర్లను మోదీ కోరారు.హర్యానాలోని పల్వాల్‌లో జరిగిన ఎన్నికల అంతిమ ర్యాలీలో తనకు లభించిన అఖండ మద్దతు, రాష్ట్రం పట్ల ప్రజలకు తనకున్న ప్రత్యేక గౌరవానికి నిదర్శనమని ప్రధాని మోదీ అభివర్ణించారు. అక్టోబరు 5న హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, అక్టోబర్ 8న ఫలితాలు వెలువడనున్నాయి.

## ఉద్దేశం మంచిదే అయినా దూకుడే అసలు సమస్య

హక్కులిచ్చింది ప్రభుత్వమే. వారి వద్ద నుంచి ఇంటి పన్నులు కట్టించుకుని రిజిస్ట్రేషన్లు చేసిచ్చి ఇప్పుడు అది ప్రభుత్వ స్థలం చెరువు జాగా అంటే ప్రభుత్వం తప్పు చేసినట్లే. రేవంత్ ప్రభుత్వం ఈ విషయాన్ని మర్చిపోయింది. అందుకే సమస్యల్లో ఇరుక్కుపోయింది.

## వారి గూడును కూల్చేశారు.. కలలను చిదిమేశారు

మీరొచ్చి ఆ చిట్టి తల్లులకు చెప్పండి.. మీ ఇళ్లు కూల్చి, మాల్స్ కడుతున్నాము మీ బ్రతుకులు బాగుపడతాయని. ఇదేనా మీరు చెప్పిన ప్రజాపాలన! డియర్ రాహుల్ గాంధ దయచేసి తెలంగాణలో మీ కూల్చివేత సర్కార్‌ని ఒకసారి చూడండి.” అంటూ ఇద్దరు చిన్నారులు కూల్చేసిన తమ ఇంటి శిథిలాల్లో ఆడుకుంటున్న వీడియోను కేటీఆర్ ట్వీట్ చేశారు. కేటీఆర్ చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ ఎమోషనల్ వీడియోను చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. పేద పిల్లల పట్ల ప్రభుత్వానికి కనీసం కనికరం లేదా అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. “ఎంతటి రాతి గుండె అయినా ఇలాంటివి చూసినప్పుడు మనసు కరిగిపోయి కళ్లల్లో నీళ్లు తిరుగుతయ్. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం పెద్దల మనసు మాత్రం మారడం లేదు.” అంటూ మరో నెటిజన్ కామెంట్ ఇచ్చారు. “ఏం రాజకీయమో ఏమో ప్రజల జీవితం అస్తవ్యస్తం చేస్తున్నారు.” అని ఇంకో నెటిజన్ విచారం వ్యక్తం చేస్తున్నారు. మూసీ ప్రక్షాళన అనేది పెద్ద స్కామని కేటీఆర్ ఆరోపించారు. నమామి గంగే 2400 కిలోమీటర్లు ఉండే గంగానది ప్రక్షాళనకు పేరుతో కేంద్ర సర్కారు 40 వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేసిన కేటీఆర్ 55 కిలోమీటర్ల మూసీ సుందరీకరణకు మాత్రం లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తుండటం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు.

## లడ్డూపై సీబీఐ దర్యాప్తుకు సర్కార్ ఓకే

లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్న అంశంపై సుప్రీంకోర్టు ఎల్లుండి నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సిట్ దర్యాప్తు కొనసాగిస్తే తలెత్తే పరిణామాలపై అంచనా వేసుకున్న ప్రభుత్వం దానికి బ్రేక్ వేసింది. ఈ మేరకు తిరుమలలో డీజీపీ కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ లాయర్లు చేసిన సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సుప్రీం ఎల్లుండి ఇచ్చే ఆదేశాల తర్వాత సిట్ దర్యాప్తుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని డీజీపీ తేల్చిచెప్పేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ దర్యాప్తుకు అభ్యంతరాలు లేదని చెప్తున్న నేపథ్యంలో సిట్ దర్యాప్తు నిలిపివేత ప్రాధాన్యం సంతరించుకుంది.

## సొంతూరిలోనే ఉద్యోగం చేసుకోవచ్చు

గత ఐదేళ్లలో ఒక్క ఎకరాకు నీరివ్వలేదు. పైసా ఖర్చు లేకుండా రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తాం. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. రీసర్వే పేరుతో ప్రజల భూముల సరిహద్దులు చెరిపేశారు. వాటిని సరి చేస్తున్నాం. భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాం. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలనేదే నా లక్ష్యం.’ అని చంద్రబాబు పేర్కొన్నారు.

## జమ్మూ కాశ్మీర్ లో ప్రశాంతంగా ముగిసిన మూడో దశ పోలింగ్

జమ్మూ జిల్లాలోని 11 సెగ్మెంట్లలో బిష్నా (ఎస్సి) 72.75%, సుచేత్‌గఢ్ (ఎస్సి) 68.02%, ఆర్ ఎస్ పురా–జమ్ము సౌత్ 61.65%, బహు 57.07%, జమ్మూ ఈస్ట్ 60.21%, జమ్ము 731%, జమ్ము 62.94%, పశ్చిమ 62.94 శాతం పోలింగ్ నమోదు అయింది. ఉధంపూర్ జిల్లాలోని నాలుగు సెగ్మెంట్లలో ఉదంపూర్ వెస్ట్‌లో 73.20%, ఉధంపూర్ ఈస్ట్‌లో 74.07%, చెనానిలో 73.79%, రామ్‌నగర్ (ఎస్సీ) 70.38% పోలింగ్ నమోదైంది. బారాముల్లా జిల్లాలోని ఏడు స్థానాల్లో సోపోర్ 41.44%, రఫియాబాద్ 58.39%, ఉరి 64.81%, బారాముల్లా 47.95%, గుల్‌మార్గ్ 64.19%, వాగూరా–క్రీరీ 56.43%, పట్టాన్ 60.87% నమోదయ్యాయి. అక్టోబర్ 8న ఫలితాలు విడుదల చేయనున్నారు. జమ్మూ కాశ్మీర్ లో 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేశారు. అప్పటి నుంచి అక్కడ ఎన్నికలు జరగలేదు.

## వరద సాయం ప్రకటించిన కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి బాధితులకు పునరావాస కేంద్రాల ద్వారా సహాయం అందించింది. అటు, తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెటం జిల్లాల్లో వరదలు బీభత్సం సృష్టించాయి. కాగా, ఇటీవల తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వరదలతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాలపై నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ప్రాథమిక నివేదిక మేరకు తక్షణ సాయంగా ఈ నిధులు కేటాయించింది. పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.

### అక్కను ఇంతగా అవమానిస్తారా??

# వదిలిపెట్టను

అటువంటి సంబంధాలపైన కూడా బిఆర్ఎస్ సోషల్ మీడియా సంస్కారహీనంగా పోస్టులు పెట్టడం దారుణమని ఆయన అన్నారు. ఒక తమ్ముడిగా మంత్రి సురేఖకు తను అడిగి మరీ నూలు పోగు దండ వేశానని, అలాంటి దండను ప్రధాని నరేంద్ర మోడీ వచ్చినప్పుడు కూడా వేశానని కానీ దీనిపైన బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసిందని రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్క కొండా సురేఖకు జరిగిన అవమానానికి తమ్ముడిగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని ఆయన తెలిపారు. పోస్టులు పెట్టిన వారిపైన ఒక లాయర్ గా కోర్టుకు వెళ్తామని పేర్కొన్న రఘునందన్ తప్పుడు ప్రచారం చేసిన వాళ్ళు మీ వాళ్ళు అయితే తీసుకొచ్చి పోలీసులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నేతలకు సోషల్ మీడియా మీద కంట్రోల్ లేదా అని ప్రశ్నించారు. ఇక పోస్ట్ పెట్టిన వ్యక్తి మీకు సంబంధం లేని వారైతే వాళ్లపైన మీరు ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ ట్రోల్ చేస్తున్న వారి వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్న బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఇంత సంస్కారహీనంగా, సభ్యత లేకుండా మాట్లాడతారని తాను అనుకోలేదని వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరినైనా వ్యక్తిత్వ ఖననం చేయడం మంచిది కాదని, తన వల్ల అక్క సురేఖకు కలిగిన సౌకర్యానికి చింతిస్తూ విచారం వ్యక్తం చేస్తున్నానని బిజెపి ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు.

## వైభవంగా రేణుక మాతా అభిషేకం



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటే సర్వ పాపాలు తొలగిపోతాయని పాల్వంచ మమత విజయ్ గౌడ్ దంపతులు కోరుకున్నారు. ఆది శక్తి పరాశక్తి అయినా ఎల్లమ్మను నమ్ముకుని చేసిన పనులు సత్ఫలితాల నిస్తాయని పేర్కొన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవము అనంతరం 40 వ మంగళవారం నాడు శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పాల్వంచ మమత విజయ్ గౌడ్ దంపతులచే శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక,అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా ప్రసన్న చారి శర్మ వేద మంత్రోచ్ఛహరణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో ఎస్సై మహమ్మద్ గౌస్, డా రమేష్, ఏ పి ఓ మహిపాల్ రెడ్డి, మండల గౌడ సంఘం అధ్యక్షులు వెంకట్ గౌడ్ ( గజినీ ) బ్యాంక్ సిబ్బంది రమేష్, బ్రహ్మేశ్వర్ రావు, ప్రభాకర్,రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్,లక్ష్మి నారాయణ గౌడ్,సంజీవ్ రావు,శ్రీనివాస్ గౌడ్, రాజగౌడ్, రాజిరెడ్డి, దుర్గపతి,అనిల్, దుర్గ ప్రసాద్ గౌడ్ ,యాదగౌడ్, సత్య నారాయణ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి హైస్కూల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు











మంథని (ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని కృష్ణవేణి హైస్కూల్లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించినారు. విద్యార్థినిలు ఉపాధ్యాయురాలు రంగురంగుల పూలతోని బతుకమ్మలను అందంగా పేర్చినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమాదేవి శ్రీరామ్ పట్ల సంతోషిని పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కృష్ణవేణి పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం విద్యార్థులకు విద్యతో పాటు తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలను పండగల ప్రాధాన్యతలను తెలిసేటట్టుగా చేస్తున్నందుకు పాఠశాల యజమాన్యానికి అభినందనలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేసి ఆనందంగా గడిపినారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థునీలకు అభినందనలు తెలియజేసినారు.

## ప్రేమ్ సాగర్ ఎమ్మెల్యే, మాకు సెలవులు ఇప్పించండి.

**విజయ్ కుమార్ నారమళ్ళ గురుదక్షిణ అధ్యక్షులు.**



మంథని ( ప్రశ్న న్యూస్) మేము ఎవరి మాట వినము, మేము చెప్పిందే వేదం, మమ్మల్ని ఎవరేం చేయలేరు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు మా గుప్పిట్లో ఉన్నాయి,ఇక విద్యాధికారులైతే మా కనుసైగల్లో ఉంటారు, ఇది తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల యజమానుల తీరు, ముఖ్యంగా మంచిర్యాల పట్టణంలో అయితే యజమానుల ఆగడాలకు హద్దులు లేవు, ప్రభుత్వ సెలవుల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు కూడా సెలవులు ఇవ్వాలని గురుదక్షిణ కమిటీ విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, దున్నపోతు మీద వాన పడ్డట్టు, మా పత్రిక వార్తలు నీటి మీద రాతలై పోతున్నాయి, విద్యాధికారులు నిద్ర వదిలి ప్రైవేట్ విద్యాసంస్థలకు కూడా, ప్రభుత్వ సెలవులు ఇచ్చేలా చూడాలని గురుదక్షిణ అధ్యక్షులు విజయకుమార్ నారమళ్ళ డిమాండ్ చేశారు, సెలవు దినాల్లో గురువులతో పని చేయించుకుంటూ గోసపెడుతున్న ఈ యజమానులపై విద్యాధికారులు చర్యలు తీసుకోవాలనీ, దశాబ్ద కాలంగా ప్రభుత్వ సెలవుల విషయమై గురుదక్షిణ కమిటీ విద్యాధికారుల, ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, ఎలాంటి ఉపయోగం కనిపించట్లేదనీ, ఈసారి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చొరవ తీసుకొని మా గురువులకి, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఇచ్చినట్లుగానే ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చేలా విద్యాధికారికి చెప్పాలని విజయ్ అన్నారు. తెలంగాణలో ఆడపడుచులకి అతిపెద్ద పండుగ అయినటువంటి బతుకమ్మ పండగకి నియోజకవర్గ మహిళలందరికి బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన ఘనత ప్రేమ్ సాగర్ రావు మరియు సురేఖ గారికే దక్కిందనీ కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ద్వారా పదవిలో ఉన్న లేకపోయినా ప్రతి ఏటా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం అనేది ఎంతో హర్షనీయం అట్లాంటి పరిస్థితిలో స్థానిక మంచిర్యాలలోని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు మాత్రం సెలవులు ప్రకటించి గురువులను విధుల్లోకి రావాలని ఆంక్షలు విధించారు దీంతో మహిళా గురువులు ఎంతో నిరాశతో ఉన్నారు పండగ వేళా కుటుంబంతో కలిసి జరుపుకోకుండా,సెలవులు ఇవ్వకుండా ముఖ్యంగా మహిళా గురువులను ఇట్లాంటి వేధింపులకు గురిచేయడం సరికాదని ప్రేమ్ సాగర్ రావు, సురేఖ గారు చొరవ తీసుకొని దసరా సెలవులు ఇప్పించాలని విద్యాధికారులకు ఆదేశిస్తూ గురువులకు న్యాయం చేయాలని గురుదక్షిణ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్ది పద్మ కోరారు.

## మంత్రి కొండా సురేఖ పై అసభ్యకర పోస్టు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**సభ్యత సంస్కారం మరిచి బీసీ మంత్రి కొండ సురేఖ పై అసభ్యకర మైన పోస్ట్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి**

**మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగ్యరాజ్ డిమాండ్ చేశారు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కాంగ్రెస్ మహిళా నాయకులే లక్ష్యంగా బిఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పనిచేస్తుందని దాన్ని తెర వెనుక నడిపిస్తున్నది కేటీఆర్, హరీష్ రావు ని అన్నారు ఆనాడు సీతక్క, జిహెచ్ఎంసి మేయర్ పై ట్రోల్ చేసిన బిఆర్ఎస్ నాయకులు ,నేడు కొండా సురేఖ పై అసభ్యకర పోస్టులు పెట్టడం దారుణం అన్నారు కాంగ్రెస్ మహిళా నేతల్ని టార్గెట్ చేస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్న బిఆర్ఎస్ నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు మహిళల గౌరవాన్ని కాపాడేలా ప్రతిపక్ష నాయకులు వ్యవహరించాలని లేనియెడల రానున్న రోజుల్లో మహిళలు తగిన రీతిలో బుద్ధి చెప్తారని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్, ఘాటుగా హెచ్చరించారు.

## బీసీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



మంథని (ప్రశ్న న్యూస్) పెద్దపెల్లి పరిధిలోని రంగంపల్లి లో ఉన్న బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, భోజనం నాణ్యత మొదలగు వివరాలను కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో వార్డెన్ అందుబాటులో ఉంటున్నారా, ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా, పారిశుధ్యం బాగా ఉందా, స్టడి అవర్స్ జరుగుతున్నాయా వంటి అంశాలను ఆరా తీసిన కలెక్టర్ వసతి గృహం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల యందు సి. టీం. సైబర్ క్రైమ్. పై అవగాహన సదస్సు.

**మంథని సీఐ. రాజు**





మంథని ( ప్రశ్న న్యూస్) రామగిరి మండలంలోని పన్నూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల యందు రామగుండం కమిషనర్ ఎం శ్రీనివాసులు ఐపీఎస్ , పెద్దపల్లి డిసిపి డాక్టర్ చేతన ఐపీఎస్ , గోదావరిఖని ఎసిపి ఎం. రమేష్ , ఆదేశానుసారం మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బి రాజు , రామగిరి ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యార్థినీయులతో సైబర్ క్రైమ్ ,100 కాల్స్, షీ టీం. పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇట్టి ఈ కార్యక్రమంలో మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బి రాజు , మాట్లాడుతూ విద్యార్థినిలు తమకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని అట్టి లక్ష్యం నెరవేరేవరకు కష్టపడి చదివి, తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థినిలు సెల్ఫోన్లను ఎక్కువగా వాడకుండా ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ వాట్సాప్ వంటి వాటిని వాడకూడదని వాటి వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించడం అయినది.మీకు తెలియని ఏదైనా ఫోన్ నెంబర్ నుండి కాల్స్ కానీ మెసేజ్ కానీ మిమ్మల్ని ఏమైనా ప్రలోభాలకు గురిచేసిన వెంటనే1930 నెంబర్ కు కాల్ చేసి పోలీసు వారి సహాయం పొందాలని . వాట్సాప్ డీపీలో తమ ఫోటోలు పెట్టుకోకూడదని వాటి వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించడమైనది. ఎవరైనా ఆకతాయిలు మీ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కళాశాల చుట్టుపక్కఆవరణలో ఎవరైనా మద్యం సేవించినట్లయితే వెంటనే 100 కాల్ చేసి సమాచారం అందించాలని చెప్పనైనది. పాఠశాలలో ఆడే ఆటల వల్ల స్నేహం, ఐకమత్యం, పట్టుదల ,ఎక్కువగా అలవర్చుకోవాలని. మంచి ఉన్నత చదువులలో మిమ్ములను చూడాలని మీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెంచుకుంటారు మంచిగా చదువుకొని ఈ ప్రాంతానికి మండలానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సిఐ .రాజు విద్యార్థులకు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం రవాణా టెండర్లు

- ఉమ్మడి జిల్లాలో ఒకరూలు వనపర్తికి మరో రూలు
- కొరవడిన కలెక్టర్ పర్యవేక్షణ
- పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం: రాచాల యుగంధర్ గౌడ్



వనపర్తి (ప్రశ్న న్యూస్): వనపర్తి జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం రవాణా టెండర్లు కేటాయిస్తున్నారని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు.మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం రవాణా కొరకు టెండర్లు ఆహ్వానించిందని,అయితే కొన్ని కారణాల వల్ల జిల్లాలోని కొత్తకోట, పెబ్బేరు సెక్టారుకు సంబంధించిన టెండర్లు రద్దు చేసి మళ్లీ రీ టెండర్లకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి కొత్తకోట సెక్టారుకు 2, పెబ్బేరు సెక్టారుకు 3 దాఖలు కాగా మంగళవారం వాటిని ఓపెన్ చేశారన్నారు.నిబంధనల ప్రకారం దాఖలు చేసిన వాహనాలకు సంబంధించిన పత్రాలను అడిషనల్ కలెక్టర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు సమక్షంలో రోడ్డు రవాణా అధికారి పరిశీలించాలన్నారు.కానీ ఫారం %దీ% 24 కు సంబంధించిన కొన్ని పత్రాలు నాగర్ కర్నూలు జిల్లా ఆర్టీవో ముద్ర వేసి ఇచ్చారని, కానీ సంతకం లేదన్న కారణంతో వనపర్తి ఆర్టీవో అభిప్రాయం తీసుకోకుండానే జిల్లా మేనేజర్ ఇర్ఫాన్ పెబ్బేరు ,కొత్తకోట సెక్టార్లకు సంబంధించిన ఒక్కో టెండర్ ఫారం రద్దు చేశారని మండిపడ్డారు.నాగర్ కర్నూలు,కల్వకుర్తి, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన పత్రాలు సమర్పిస్తే అక్కడ ఆమోదించారని, వనపర్తి జిల్లాలో మాత్రం ఎందుకు రద్దుచేశారో చెప్పాలన్నారు. కీలకమైన శాఖలపై కలెక్టర్ పర్యవేక్షణ కొరవడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా కొన్ని శాఖల అదికారులు మాత్రం బిఆర్ఎస్ నాయకుల ఒత్తిడికి తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు.పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఇర్ఫాన్ అవినీతి అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు రాఘవేందర్ గౌడ్, అంజన్న యాదవ్,మహిందర్ నాయుడు, శివ గౌడ్, మ్యాదరి రాజు, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నల్లవెల్లి భరత్, గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్,తెలంగాణ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రతలో దంతాల ఆరోగ్యం చాలా ముఖ్యం

- ఏ.జి.యం. మహమ్మద్ నూర్ అలీ
- మంచి ఆరోగ్యం, జీవితానికి ఒక గొప్ప వరం



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రామంతాపూర్ శ్రీ చైతన్య పాఠశాలలో హెల్త్ ఇండియా కార్యక్రమంలో భాగంగా డా. కసిరెడ్డి శ్రవణ్, డా.అనుష, గ్లో-డెంట్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ గూడ జోన్ ఏ.జి.యం. మహమ్మద్ నూర్ అలీ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన దంతాలు, ఆరోగ్యకరమైన శరీరానికి ముఖ్య లక్షణమని సూచించారు. రామంతపూర్ శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్య లక్ష్మి మాట్లాడుతూ వ్యక్తి గత శుభ్రతలో దంతాల ఆరోగ్యం చాలా ముఖ్యమని, నోటి శుభ్రత పై శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమం లో జోన్ కో ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, డీన్ నాగరాజు, ఇంచార్జులు కనకయ్య, అరుణ్ కుమార్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక డంపుకు వేలం పాట నిర్వహించిన ఎమ్మార్వో



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో దుబ్బాక గ్రామంలో గ్రామ శివారులో గల ఇసుక డంపింగ్ గుర్తించి పట్టుకున్న ఇసుక డంపుకు వేలం నిర్వహించడం జరిగింది. సుమారు 55 ట్రాక్టర్ల డంపుకు తాసిల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఇట్టి వేలంపాటలో పాల్గొన్న కావేటి నరేందర్ వినోద్ మధ్య వేలం పాట జరిగింది. దాంట్లో 72,500 కు దుబ్బాక చెందిన వినోద్ దక్కించుకున్నారు దానికి 48 గంటల లోపు ఉసికెను తరలించుకోవాలని మండల స్థాయిలో ఎక్కడైనా పోసుకోవాలి డంపు చేయరాదు అని ముందుగానే ఎమ్మార్వో మాలతి వారికి సూచించారు. దానికి అనుగుణంగానే 72,500 పాట పాడిన వినోద్ కు కలెక్టర్ పేరు మీద డిడి తీయాలని సూచించారు. 48 గంటలు దాటిన, మండలం దాటిన, ఇంకెక్కడ డంపు చేసిన మాకు సంబంధం లేదు మళ్లీ దొరికితే సీజ్ చేయడం జరుగుతుందని ఆమె వెల్లడించారు.

# హైడ్రా మిస్ ఫైర్ అవుతుందా.?

## – ఈ వ్యవస్థతో కాంగ్రెస్ ప్రభుత్వానికి లాభమా! నష్టమా!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు నానుతున్న ప్రభుత్వ సంస్థ ఏదైనా ఉందంటే అది హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ. రెండక్షరాల్లో చెప్పాలంటే హైడ్రా. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడం. వర్షాలు, వరద సమయాల్లో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు చేపట్టడం హైడ్రా ముఖ్య విధులు. అవుటర్ రింగ్ రోడ్ పరిధి వరకు హైడ్రా తన విధులను నిర్వర్తించనుంది. అయితే ఇందులో చెరువు భూముల పరిరక్షణ పేరుతో గత కొద్ది రోజులుగా హైడ్రా సంచలనం సృష్టిస్తోంది. ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సహా, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎం.ఐ.ఎం వంటి పార్టీ నేతలకు చెందిన నిర్మాణాలను చెరువు బఫర్ జోన్లో లేదా ఎఫ్టీఎల్ పరిధిలో ఉందంటూ కూల్చి వేసింది. ఆ తర్వాత సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్ల కూల్చి వేతలు అక్కడక్కడ నగర పరిధిలో జరిగాయి. దీంతో హైడ్రా పని తీరుపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

### హైడ్రాపై కామన్ మ్యాన్ ఏమంటున్నాడంటే.?

హైడ్రా కూల్చివేతల అంశం రాష్ట్రంలో సర్వత్రా నలుగుతున్న చర్చ. హైదరాబాద్ చెరువుల ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో బడా బాబులు అక్రమంగా నిర్మించుకున్న భవంతులు, ఫాం హౌస్ లపై హైడ్రా విరుచుకుపడుతుందన్న కారణంతో ప్రారంభంలో హైడ్రాకు సామాన్య జనం జై కొట్టింది. ఇప్పుడు పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూల్చి వేస్తుంటే మాత్రం మీడియాలోను, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు.. మొదట్లో హైడ్రాకు మద్ధతు ఇచ్చిన ప్రజలు ఇప్పుడు భిన్న స్వరాలు ఆలపిస్తున్నారు. బడాబాబుల ఇళ్ల కూల్చి వేతల విషయంలో ప్రభుత్వం ఏ మాత్రం పక్షపాతం వహించకుండా న్యాయంగా వ్యవరిస్తుందన్న భావన వ్యక్తమయింది. అదే రీతిలో అన్ని వర్గాల నుంచి చక్కటి మద్ధతు లభించింది. అయితే రాను రాను ఇప్పుడు సామాన్య జనం నుంచి కొంత వ్యతిరేక భావం మొదలయింది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లను చెరువు భూముల్లో ఉన్నాయని అధికారులు కూల్చి వేస్తుంటే రాష్ట్రంలో నిరసన స్వరాలు వినపడుతున్నాయి. పేదలు పైసా పైసా కూడబెట్టుకుని ఇళ్లు కట్టుకుంటున్న పరిస్థితి. మధ్యతరగతి ప్రజలు బ్యాంకుల నుండి లోన్లు తీసుకుని ప్రతీ నెల వడ్డీతో సహా అసలు చెల్లిస్తూ ఏన్నో ఏళ్ల నుండి వ్యయ, ప్రయాసల కోర్చి అన్ని శాఖల అనుమతులు తీసుకుని ఓ గూడు నిర్మించుకుంటే హఠాత్తుగా ఇది చెరువు భూముల్లో ఉందని కూల్చి వేస్తుంటే వారి హృదయ విదారక పరిస్థితిని చూసిన వారు ఇదేం అన్యాయం అని ప్రశ్నిస్తున్నారు. చెరువు భూముల్లో ఉంటే అసలు బిల్డింగ్ పర్మిషన్లు ఎలా ఇచ్చారన్న ప్రశ్నలు ప్రజల నుండి వస్తున్నాయి. భూ రికార్డులు పక్కాగా పరిశీలించాకే బ్యాంకులు రుణాలు ఇస్తాయి. ఇలా తమ ఇళ్ల భూ రికార్డులు పరిశీలించి బ్యాంకులు లోన్లు ఇచ్చాయని ఇవన్నీ అయ్యాక ఇళ్లు కట్టుకుంటే హఠాత్తుగా హైడ్రా అనే సంస్థ కొత్తగా పురుడు పోసుకుని మీ ఇళ్లు అక్రమ కట్టడం అని కూల్చివేయడం ఏంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలకు అన్ని వర్గాలు మద్ధతు ఇస్తున్నా పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలను అతలా కుతలం చేసేలా ఈ చెరువుల పరిరక్షణ ఉండం న్యాయం కాదన్న చర్చ ప్రజల్లో సాగుతోంది. చెరువు భూముల్లో కట్టడాలు అక్రమం అయితే అందుకు సహకరించి అనుమతులు ఇచ్చిన ప్రభుత్వ అధికారులది తప్పే అన్న వాదన వ్యక్తం అవుతుంది. అధికారులు చేసిన తప్పునకు సామాన్యుడు ఎందుకు మూల్యం చెల్లించాలన్నది కామన్ మ్యాన్ వేస్తోన్న ప్రశ్న.

### న్యాయస్థానం ఏమంటుందంటే.?

హైడ్రా కూల్చివేతలపై న్యాయస్థానాన్ని కొందరు ఆశ్రయించడంతో ఈ వ్యవహారం ఇప్పుడు మరో కొత్త మలుపు తీసుకుంది. హైడ్రాకు ఉన్న చట్టబద్దత ఏంటన్న ప్రశ్న హైకోర్టు లేవనెత్తింది. హైడ్రా ఏర్పాటు జీహెచ్ఎంసీ చట్టమైన జీవో 99కు విరుద్దంగా లేదా అసలు జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం హైడ్రాకు ప్రభుత్వం ఎలా అధికారాలు కల్పించో చెప్పాలని ప్రశ్నించింది. జీహెచ్ఎంసీ చట్టాల ప్రకారం హైడ్రా పని చేయడం చట్టబద్ధత ఏలా అవుతుందని హైకోర్టు ప్రభుత్వాన్ని వివరణ ఇవ్వాలని కోరింది. హైడ్రా ఏర్పాటు చట్టంలో ఈ సంస్థ సీనియర్ ఐఎఎస్ అధికారి ఉంటారని చెప్పి ఐపీఎస్ కు ఆ బాధ్యతలు కట్టబెట్టడం సబబేలా అవుతుందని న్యాయస్థానం ఆక్షేపించింది. అసలు నోటీసులు ఇవ్వకుండా, బాధితుల వివరణ తెలుసుకోకుండా అక్రమ కట్టడాలంటూ కూల్చివేయడం ఎలా చట్టవిరుద్దం కాదో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. వీటిపై ఈ గురువారం ప్రభుత్వం న్యాయస్థానంలో సమాధానం ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలోనే తాజాగా న్యాయస్థానం హైడ్రా కమిషనర్ పైన అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ఆదివారం సెలవు దినం అలాంటి రోజు అధికారులు కూల్చివేతలు చేపట్టడం ఏంటో సమాధానం ఇవ్వాలని హైడ్రా చీఫ్ ఏవీ రంగనాథ్ ను ప్రశ్నించింది. అమీన్ పూర్ లో కట్టడాల కూల్చివేతలను న్యాయస్థానం తప్పుబట్టింది. ప్రభుత్వం, పై అధికారుల మెప్పు కోసం పని చేయవద్దని.. చట్టాలు ఫాలో కావాలని సూచించింది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్టర్ చేశాకే, స్థానిక సంస్థలు అనుమతి ఇచ్చాకే సామాన్యులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా సామాన్యుడు నష్టపోవాల్సిందేనా అని న్యాయస్థానం తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. హైడ్రా ఏర్పాటు అభినందనీయమైనా, పని తీరు అభ్యంతరకరమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇలా నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తే హైడ్రో జీవో పైన స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఓ మాటలో చెప్పాలంటే కాసింత మానవత్వంతో, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని హైకోర్టు హైడ్రాకు సూచించింది.

### సీఎం రేవంత్ రెడ్డి ఏమంటున్నారంటే.?

హైడ్రా ఏర్పాటు ఆ తర్వాత జరుగుతున్న పరిణామాలు అన్నీ భగవద్గీత అనుసారమే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్ కు మంచి నీరు అందించే హిమాయత్ సాగర్ లో బడా బాబులు అక్రమ నిర్మాణాలు చేపట్టి వారి బాత్రూంలలో వాడే నీరు చేరడం సరైనదేనా అన్న ప్రశ్న ప్రజల ముందుంచారు. అలాంటి వ్యర్థ జలాలను హైదరాబాద్ నగర వాసులకు అందిస్తే సీఎంగా తాను ఫెయిల్ అయినట్లేనని హైడ్రా పని తీరును సీఎం రేవంత్ రెడ్డి సమర్థిస్తున్నారు. ఎంతటి వారైనా సరే చెరువులను అక్రమిస్తే వదిలేది లేదని చాలా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో హైడ్రా విషయంలో ప్రభుత్వం వెనక్కు తగ్గేది లేదన్న సంకేతాలు సీఎం రేవంత్ ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు, రాజకీయ పార్టీలకు పంపారు. లేక్ సిటీగా ఉన్న హైదరాబాద్ ఫ్లడ్ సిటీగా మారిందని, మళ్లీ హైదరాబాద్ కు పూర్వ వైభవం హైడ్రా ద్వారానే అన్న రీతిలో రేవంత్ రెడ్డి తన మనసులోని మాట బయట పెట్టారు. నిరుపేదల ఇళ్లు కూల్చివేస్తే వారికి డబులు బెడ్ రూంలు కేటాయించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.అయితే హైడ్రాకు అవసరమైన సిబ్బందిని, హైడ్రా విధులకు అవసరమైన అన్ని హంగులు సమకూర్చి బలోపేతం చేయడం ద్వారా చెరువు భూములు ఆక్రమణల లెక్కలు సరి చేయడంలో వెనక్కు తగ్గేదే లేదని చెప్పకనే చెబుతున్నారు. హైడ్రాకు త్వరలోనే దీనికి చట్టబద్ధత కల్పించేలా చర్యలు చేపట్టేందుకు సీఎం సన్నాహాలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో హైడ్రా మరిన్ని చెరువు భూముల్లో ఉన్న కట్టడాలు కూల్చి వేయడం ఖాయమని ఎవరూ చెప్పినా వినేది లేదన్న రీతిలో సీఎం ఇప్పటికే తన మాటల ద్వారా చేతల ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు.

### హైడ్రా చీఫ్ ఏవీ రంగనాథ్ ఏం అంటున్నారంటే.?

హైడ్రా ప్రకృతిని పరిరక్షించడానికి, హైదరాబాద్ నగరానికి పూర్వ వైభవం తేవడానికే ఏర్పడిందని హైడ్రా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ చెబుతున్నారు. చెరువు భూములు ఆక్రమించి కట్టిన కట్టడాలు కూల్చక తప్పదని స్పష్టం చేస్తున్నారు. హైడ్రా ఓఆర్ఆర్ పరిధిలోనే చెరువులు ఆక్రమిస్తే కూల్చి వేస్తుందని, ఓఆర్ఆర్ బయట జరిగే చెరువు ఆక్రమణల విషయంలో తమకు సంబంధం లేదని చెప్తున్నారు. అంతే కాకుండా ఇటీవలే మూసీ నదీ ప్రక్షాళన పేరుతో అధికారులు పేదల ఇళ్లు కూల్చడం తెలంగాణలో తీవ్ర వ్యతిరేకతకు దారి తీసింది. అయితే దాంతో తమకు సంబంధం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అదే రీతిలో ఎక్కడ చెరువు భూముల్లో కూల్చివేతలు జరిగినా హైడ్రాకు ముడిపెట్టడం భావ్యం కాదని రంగనాథ్ చెబుతున్నారు.సంగారెడ్డిలోని మల్కాపూర్ చెరువుల్లో ఆక్రమించి కట్టిన కట్టడాల కూల్చివేతకు తమకు సంబంధం లేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. మరో వైపు శని, ఆదివారాలు ఈ కట్టడాలు కూల్చి వేయడం ద్వారా రంగనాథ్ తన దైన పోలీస్ మార్కు పని తీరును కనబర్చుతున్నారు. సెలవు దినాల్లో కోర్టులకు వెళ్లి కూల్చివేతలపై స్టే తెచ్చుకోకుండా వ్యూహాత్మకంగా రంగనాథ్ తన సిబ్బందితో పని చేయిస్తున్నారు. అయితే దీనిపై హైకోర్టు రంగనాథ్ పని తీరును తప్పుపట్టింది. అయితే కొత్తగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఇలాంటి సమస్యలు తప్పవని ఒక్కో చిక్కుముడి విప్పుకుంటూ తమ పని తాము చేసుకుపోతామని ఏవీ రంగనాథ్ చెబుతున్నారు.



### రాజకీయా పార్టీలు ఏం అంటున్నాయి.?

హైడ్రా సెగ అన్ని రాజకీయ పార్టీలకు తగులుతోంది. అయితే అటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో మిశ్రమ స్పందనలు వ్యక్తం అవుతున్నాయి. తొలుత కాంగ్రెస్ ప్రభుత్వానికి హైడ్రా చర్యల వల్ల ప్రజామోదం లభించడంతో అన్ని పార్టీలు ఆచితూచి స్పందిచాయి. సామాన్యుల ఇళ్లు కూల్చివేతకు గురవడంతో ప్రజాగ్రహం వ్యక్తం అయింది. దీంతో ఆయా రాజకీయ పార్టీలు తమదైన శైలిలో ప్రభుత్వంపైన, సీఎం రేవంత్ రెడ్డిపైన విరుచుకుపడుతున్నాయి.

### బుల్డోజర్ రాజకీయాలు చేస్తోన్న కాంగ్రెస్: బీఆర్ఎస్

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ హైడ్రా తీరుపై విరుచుకుపడుతోంది. ఆ పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్ రావులు హైడ్రా పేదల పాలిట శత్రువుగా అభివర్ణిస్తున్నారు. పేదల పొట్ట కొడుతుందంటూ గత కొద్ది రోజులుగా ఇల్లు కోల్పోయిన బాధితులతో సమవేశాలు ఏర్పాటు చేస్తున్నారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. సీఎం తన సోదరుడి ఇళ్లు కూల్చకుండా నోటీసులు ఇచ్చి వదిలేసి, సామాన్యుల ఇళ్లను మాత్రమే కూల్చివేస్తారా అని ప్రశ్నలు సంధిస్తున్నారు. బుల్డోజర్ రాజకీయాలను తెలంగాణలోకి తీసుకువచ్చి సామాన్యులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నది బీఆర్ఎస్ పార్టీ నేతలు చెబుతున్నారు.

### అధిష్టానికి వాటా పంపేందుకే లక్షన్నర కోట్ల స్కాం - బీజేపీ

హైడ్రా కూల్చివేతలపై బీజేపీలో తొలుత భిన్న స్పందనలు వెలువడ్డాయి. ఎంపీ రఘునందన్ రావు వంటి వారు తొలుత హైడ్రా తీరను సమర్థిస్తూ మాట్లాడటం జరిగింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఆ పార్టీ సీనియర్ నేత ఈటల రాజేందర్ వంటి వారు మాత్రం హైడ్రా వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించారు. ఒక వర్గం వారివే కూల్చుతూ మరో వర్గం పెద్దలకు సంబంధించిన కాలేజీలు, ఇతర సంస్థల భవనాలు మాత్రం కూల్చడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. తాజాగా కేంద్రానికి వాటా పంపేందుకే హైడ్రా ఏర్పాటు చేసి బిల్డర్ల నుండి కాంగ్రెస్ పార్టీ డబ్బులు వసూలు చేస్తోందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అయితే కాంగ్రెస్ అధిష్టానానికి కప్పం కట్టేందుకే ఈ డ్రామా అంతా అని ఇది లక్షన్నర కోట్ల స్కాంగా అభివర్ణించారు.

### కాంగ్రెస్ లో భిన్న స్వరాలు

హైడ్రా విషయంలో కాంగ్రెస్ లో భిన్న స్వరాలు వినపడుతున్నాయి. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ విషయంలో తన అసంతృప్తిని వివిధ సందర్భాల్లో బహిరంగంగానే బయటపెట్టారు. మంచి పోస్టింగ్ రానందుకే హైడ్రా చీఫ్ రంగనాథ్ ఇష్టారీతిన కట్టడాలను కూల్చివేస్తున్నారంటూ తీవ్ర విమర్శలకు దిగారు. తాను ముందుగానే పేదల గుడిసెలు కూల్చవద్దని చెప్పినా వినలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక ఆపార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి ఓ అడుగు ముందుకు వేసి సంగారెడ్డిలో హైడ్రా అడుగుపెడితే చుక్కలు చూపిస్తానని హెచ్చరించారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రభుత్వ లైన్ హైడ్రాను పటిష్టం చేసి హైదరాబాద్ లో చెరువుల పరిరక్షణే ధ్యేయంగా చెప్పడం జరిగింది. అయితే ప్రస్తుతం సామన్యుల్లో వస్తోన్న అపోహలను, అనుమానాలను ఎలా హ్యాండిల్ చేస్తారో వేచి చూడాలి. ఈ పరిణామాల నడుమ హైడ్రా పనితీరుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేయడం, హైడ్రా కూల్చివేతలకు సంబంధించిన పిటిషన్ల విచారణ తర్వాత ఏలాంటి తీర్పు ఇస్తుందో , దానిపై ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే. అదే రీతిలో జరుగుతున్న పరిణామాలు రాజకీయంగా ఏ పార్టీ ఏలా వినియోగించుకుంటుందో అన్న చర్చ సాగుతోంది. హైడ్రా పని తీరు కాంగ్రెస్ కు రాజకీయంగా లబ్ధి చేకూర్చుతుందా, నష్టం కానుందా, బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడానికి హైడ్రా అనేది ఓ సాధనం అవుతుందా.. రానున్న రోజుల్లో జీహెచ్ఎంసీ పరిధిలో బీజేపీకి హైడ్రా లాభం చేకూర్చుతుందా అన్న ప్రశ్నలకు ముమ్ముందు జరిగే పరిణామాలే స్పష్టతనిస్తాయి.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ

**రవికుమార్ సంతోజు, బడంగ్ పేట్**



తెలుగు ప్రజలకు అత్యంత ముఖ్యమైన దసరా పండగకు రాష్ట్రం ముస్తాబవుతుంది. అలాగే నేటి నుండి బతుకమ్మ పండగ కూడా ప్రారంభమవుతుండడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ సంబరాలను చూసేందుకు రెండు కళ్లు చాలవు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను మొత్తం తొమ్మిది రోజుల పాటు మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ నవరాత్రులలో మద్యం మాంసాహారానికి దూరంగా ఉండడం గమనార్హం. తెలంగాణలో పల్లె నుంచి పట్నం వరకు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు. తెలంగాణ ప్రజల జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలకు ఒక ప్రత్యేకత ఉంది. బతుకమ్మ కోసం పూలను తెచ్చి తయారు చేసి ఆటపాటలతో గడుపుతారు.

**- తొమ్మిది రోజుల పాటు పూల జాతర**

నేటి నుండి ప్రారంభమయ్యే బతుకమ్మ వేడుకలు ఈనెల పదో తేదీ (గురువారం) తో ముగియనున్నాయి. చిన్నా పెద్దా అందరు కలసి ఈ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం సంప్రదాయంగా వస్తుంది. ఒక్కోరోజు ఒక బతుకమ్మను వివిధ పూలతో తయారు చేస్తారు. రకరకాల సద్దులను తయారు చేసుకుని వచ్చి నైవేద్యంగా పెడతారు. కొన్ని దశాబ్దాల నుంచి తెలంగాణలో బతుకమ్మ వేడుకలు జరుగుతు వస్తున్నాయి. తరాలు మారినను మహిళలు సంప్రదాయాన్ని పాటిస్తు సంబరాలలో పాల్గొంటున్నారు. కేవలం తెలంగాణలో మాత్రమే కాక ఇతర దేశాల్లో నివాసం ఉంటున్న తెలుగు మహిళలు కూడ బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం విశేషం. భాద్రపద అమావాస్య లేదా మహాలయ అమావాస్య రోజున ఈ బతుకమ్మ వేడుకలు ప్రారంభమై దుర్గాష్టమి వరకు ప్రతి రోజు వివిధ రకాల నైవేద్యాలతో బతుకమ్మను ఆరాధించడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలు రకరకాల పూలతో ఏ రోజుకారోజు బతుకమ్మను పేర్చి తమ ఆటపాటలతో ఆరాధిస్తారు. ఇందుకు ప్రభుత్వం కూడా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుంది. చెరువుల్లో కలిపేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం చేయనుంది. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బతికమ్మ వేడుకలలో మొదటి రోజు (అక్టోబరు 02) ఎంగిలిపూల బతుకమ్మ (అక్టోబరు 03) అటుకుల బతుకమ్మ (అక్టోబరు 04) ముద్దపప్పు బతుకమ్మ (అక్టోబరు 05) నానే బియ్యం బతుకమ్మ (అక్టోబరు 06) అట్ల బతుకమ్మ (అక్టోబరు 07) అలిగిన బతుకమ్మ (అక్టోబరు 08) వేపకాయల బతుకమ్మ (అక్టోబరు 09) వెన్నముద్దల బతుకమ్మ (అక్టోబరు 10) సద్దుల బతుకమ్మతో సంబరాలు పూర్తవుతాయి.

**- పితృపక్షం అమావాస్య ప్రధాన్యత**

హిందూ మతంలో అమావాస్య తిథికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. మరీ పితృ పక్షంలో వచ్చే అమావాస్య తిథికి మరింత ప్రాముఖ్యత ఉంటుంది. పితృపక్షంలో వచ్చే అమావాస్యను సర్వపితృ అమావాస్య లేదా సర్వ పితృ మోక్ష అమావాస్య అని కూడా అంటారు. ఈ అమావాస్య శ్రద్ధా పక్షం లేదా పితృపక్షం యొక్క చివరి రోజు. ఈ సర్వ పితృ అమావాస్య నాడు దానం, తర్పణం, పిండ దానం చేస్తారు. పూర్వీకుల కోసం వచ్చే ఈ ప్రత్యేకమైన రోజున బట్టలు, ఆహారం మొదలైనవి దానం చేయడం వల్ల జీవితంలో సుఖ సంతోషాలు, శాంతి, కలుగుతాయని నమ్ముతారు.

**- అమావాస్య నాడు చేయాల్సిన ధానాలు**

**- అన్నదానం**

పితృ అమావాస్య నాడు అన్నదానం చేయడం చాలా పవిత్రంగా భావిస్తారు. ఇలా చేయడం వల్ల జీవితంలో సంతోషం, శాంతి నెలకొంటాయని, అలాగే ఆహారాన్ని దానం చేయడం వల్ల దుఃఖాలు తొలగిపోయి పూర్వికుల ఆశీర్వాధాలు పొందుతారని ప్రగాడ విశ్వాసం

**-నువ్వుల దానం:**



సర్వ పితృ అమావాస్య నాడు నువ్వులను దానం చేయడం ద్వారా పూర్వీకులకు మోక్షం లభిస్తుందని నమ్ముతారు.

**- పండ్లు:**

అమావాస్య రోజున పండ్లను ధానం చేయడం వల్ల జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోయి పితృదేవతల అనుగ్రహం లభిస్తుందని నమ్ముతారు.

**- బెల్లం:**

పితృ అమావాస్య నాడు బెల్లం దానం చేయాలి. ఇలా చేయడం వల్ల పూర్వీకులు తృప్తి చెంది వారి వారసులను ఆశీర్వదిస్తారని నమ్ముతారు.

**- సర్వపితృ అమావాస్య నాడు బ్రాహ్మణులకు చేయాల్సిన దానాలు**

సర్వపితృ అమావాస్య నాడు శ్రాద్ధం, తర్పణం చేసిన తరువాత, బ్రాహ్మణులకు పాత్రలు, పండ్లు, ధాన్యాలు, పచ్చి కూరగాయలు, ధోతీ-కుర్తా, డబ్బు, స్వీట్లు మొదలైనవి ధానం చేయడం వల్ల పితృదేవతల ఆత్మలు సంతృప్తి చెంది తవ వారసులకు ఆశీర్వాదాలు అందిస్తారని ప్రగాడ విశ్వాసం.

## బ్రహ్మోత్సవాల తర్వాతే పాలక మండలి..?

**తిరుమల :** ఏపీలో నామినేటెడ్ పదవుల కోలాహలం మొదలై వారం గడుస్తోంది. గత వారం 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను, పాలక మండలి సభ్యుల్నినియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల్లో టిక్కెట్లు దక్కని నాయకులు, పార్టీ కోసం సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వారిని గుర్తించి వారి అనుభవం, సామర్థ్యానికి తగ్గ పోస్టుల్లో నియమించారు. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి ప్రతినిధులు, కీలకమైన పదవుల నియామకంపై మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది.తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశం మొత్తం గుర్తింపు ఉన్న పదవుల్లో ఒకటైన తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ పదవిపై ఉత్కంఠ వీడటం లేదు. గత వారమే టీటీడీ ఛైర్మన్ నియామక ప్రక్రియ కొలిక్కి వస్తుందని విస్తృతంగా ప్రచారం జరిగినా చివరి నిమిషంలో అది ఆగిపోయింది. టీటీడీ ఛైర్మన్, పాలక మండలి సభ్యత్వాల కోసం కూటమి నేతల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. ఇప్పటికే కొన్ని పేర్లు విస్తృతంగా ప్రచారం జరిగినా టీటీడీ ఛైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనసులో ఏముందో మాత్రం బయడ పెట్టడం లేదు.టీటీడీ ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న ప్రముఖుల్లో పలువురికి టీడీపీ బాధ్యులు వేర్వేరుగా హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇది కూడా టీటీడీ నియామకం కొలిక్కి రాకపోవడానికి కారణమని చెబుతున్నారు. మరోవైపు తిరుమలలో కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో ఆలయ నిర్వహణ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కల్తీ నెయ్యి వ్యవహారంతో తిరుమల వ్యవహారాలను ప్రక్షాళన చేయాలని కూటమి పార్టీలు బలంగా భావిస్తున్నాయి. మరోవైపు టీటీడీ బాధ్యతల్ని తమకు అప్పగించాలని బీజేపీ కోరినట్టు తెలుస్తోందిటీటీడీ పాలక మండలి సభ్యత్వాల కోసం ఏకంగా ఆ పార్టీకి దాదాపు 250దరఖాస్తులు వచ్చినట్టు చెబుతున్నారు. టీటీడీ పాలక మండలిలో గరిష్టంగా 23మందికి మించి సభ్యులుగా నియమించే అవకాశం ఉండదు. జనసేన, టీడీపీల నుంచి కూడా తీవ్రమైన పోటీ ఉంది. ఓ దశలో పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు పేరు కూడా టీటీడీ ఛైర్మన్ రేసులో వినిపించింది. ఈ ప్రచారాలను పవన్ తోసిపుచ్చారు. నామినేటెడ్ పదవుల వ్యవహారంలో తనపై తీవ్రమైన ఒత్తిడి ఉందని మాత్రం పవన్ స్పష్టం చేశారు. టీటీడీ సభ్యత్వాలు, పదవులు కోసం తనను ఒత్తిడి చేయొద్దని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు.కలియుగ ప్రత్యక్షదైవమైన వేంకటేశ్వరుడి సన్నిధిలో జరుగుతున్న పరిణామాలను గాడిన పెట్టేందుకు ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న నేపథ్యంలో తిరుమల వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అదే సమయంలో కూటమి పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరేలా అందరికి అమోద యోగ్యమైన వ్యక్తిని టీటీడీ ఛైర్మన్ పదవిలో నియమించే అవకాశాలు ఉన్నాయని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ప్రచారంలో ఉన్న పేర్లతో పాటు మరికొన్ని పేర్లను కూడా ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.టీటీడీ ఛైర్మన్ పదవికి గౌరవాన్ని తీసుకురావడంతో పాటు, పరిపాలనా వ్యవహారాల్లో అనుభవం ఉన్న వారు, రాజ్యాంగ పదవుల్లో పని చేసిన అనుభవం ఉన్న వారిని కూడా టీటీడీ ఛైర్మన్ గా నియమించే అవకాశాలపై సన్నిహితులతో ముఖ్యమంత్రి చర్చిస్తున్నారు. టీటీడీ నిర్వహణలో భక్తిభావం మాత్రమే ఉండాలి. రాజకీయాలకు ఆస్కారం ఉండకూడదని ముఖ్యమంత్రి ఉద్దేశంగా ఉందని చెబుతున్నారు. ప్రతిపక్షాలకు, రాజకీయ ప్రత్యర్థులకు అవకాశం ఇచ్చేలా నియామకాలు లేకుండా చూడాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుస్తోంది.ఈ క్రమంలో తిరుమల వేంకటేశ్వర స్వామి భక్తులుగా ఉన్న ప్రముఖుల పేర్లను పరిశీలిస్తున్నారు. గతంలో టీడీపీలో ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారు, సినీ ప్రముఖుల పేర్లను కూడా టీటీడీ ఛైర్మన్ పదవికి పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. సామాజిక సమీకరణల్లో భాగంగా అన్ని సామాజిక వర్గాలకు కూడా పాలకమండలిలో ప్రాధాన్యత ఉండేలా పాలక మండలిని ప్రకటించే అవకాశమున్నట్టు తెలుస్తోంది. తిరుమల బ్రహ్మోత్సవాలకు ముందే పాలకమండలిని ప్రకటిస్తారా లేదా అనే దానిపై స్పష్టత లేదు.

## ప్లాన్ బీలో జనసేన...

**విజయవాడ :** ఏపీలో జనసేన పార్టీ రోజురోజుకు బలోపేతమవుతోందా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పార్టీ క్యాడర్ ను పెంచుకోవడంలో జనసేన ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పవచ్చు. ఏపీలో కూటమి విజయంలో జనసేనదే కీలక పాత్ర అన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే అందుకు కృతజ్ఞతగా.. సీఎం చంద్రబాబు కూడా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదా కల్పించారు. అయితే పాలనా పరమైన అంశాలపై దృష్టి సారించిన పవన్.. పార్టీ క్యాడర్ బలోపేతం చేసుకొనేందుకు కూడా కసరత్తు ప్రారంభించారనే చెప్పవచ్చు. అందులో భాగంగా ఇటీవల పలువురు వైసీపీ నేతలు జనసేన పార్టీలో చేరగా.. వారిని సాదరంగా ఆహ్వానించారు పవన్. ఇప్పటికే బీజేపీ మద్దతు గల జనసేన పార్టీ క్యాడర్ పెంచడంపై వెనుక ఉన్న రహస్యంపై రాజకీయ విశ్లేషకులు చర్చలు సాగిస్తున్నారు.ఏపీ ఎన్నికల సమయంలో ఎలాగైనా వైసీపీని గద్దె దింపడమే లక్ష్యంగా.. జనసేన అధ్యక్షులు పవన్ పూర్తి స్థాయిలో ప్రయత్నించి సఫలమయ్యారు. ఎన్నికల ముందు వరకు బీజేపీతో జతకట్టిన పవన్.. ఎన్నికల సమయానికి టీడీపీని సైతం కలుపుకొని కూటమిగా బలపడ్డారు. ఆ తర్వాత ఎన్నికల ఫలితాలు ఊహించని రీతిలో కూటమికి విజయాన్ని అందించాయి. ఈ ఎన్నికల్లో జనసేన 22 కి 22 స్థానాలు దక్కించుకోవడంతో పార్టీ క్యాడర్ లో ఆనందానికి అవధుల్లేవు. అలాగే రాష్ట్రంలో జనసేనకు ప్రజల మద్దతు ఉందన్న ధీమా సైతం నాయకుల్లో వ్యక్తమైంది. అయితే ప్రస్తుతం డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్.. జనసేన క్యాడర్ పై దృష్టి సారించారు. ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన వైసీపీ నుండి ప్రస్తుతం వలసల పర్వం సాగుతోంది. అయితే పార్టీ మారాలనుకున్న వారు.. టీడీపీ వైపు కాకుండా జనసేన వైపుకు మాత్రమే చూడడం విశేషం. టీడీపీ క్యాడర్ నుండి వ్యతిరేక పవనాలు వీస్తున్న క్రమంలో వైసీపీ నేతలను టీడీపీ అధిష్టానం పార్టీలోకి తీసుకొనేందుకు విముఖత చూపిస్తోంది. కానీ జనసేన మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా.. వైసీపీ నేతలకు పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలుకుతోంది.ఇలా చేరికలతో జనసేన బలోపేతం అవుతుండగా.. క్షేత్రస్థాయిలో జనసేన, టీడీపీ ఛోటా నాయకుల మధ్య అక్కడక్కడా కొంత విభేదాలు బయట పడుతున్నాయి. దీనికి ఉదాహరణే ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని చేరిక. అక్కడ స్థానికంగా టీడీపీ నేతలు వ్యతిరేకిస్తున్నా.. జనసేనలో చేరారు బాలినేని. ఆయన చేరికతో ప్రకాశం జిల్లాలో కొంత టీడీపీ, జనసేన నేతల మధ్య విభేదాలు బయట పడ్డాయి. ఇలా క్షేత్రస్థాయిలో జనసేన చేరికల ఎఫెక్ట్ కనిపిస్తోంది. జనసేన బలోపేతం కావడం పవన్ లక్ష్యం కాగా.. దీని వెనుక వేరే కారణాలు ఉన్నాయా అనేది విశ్లేషకుల అంచనా. ఇప్పటికే బీజేపీతో దోస్తీ గల పవన్ క్యాడర్ ను పెంచుకుంటే బీజేపీకి కూడా రాష్ట్రంలో బలం చేకూరుతుంది. అలాగే హిందుత్వ వాదాన్ని ఇటీవల పవన్ ఎక్కువగా వినిపిస్తున్నారు. అంటే బీజేపీ నుండి వచ్చిన ఆదేశాలతోనే పవన్? పార్టీ బలోపేతంపై దృష్టి సారించి, హిందుత్వ వాదాన్ని ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారన్న ప్రచారం సాగుతోంది.ఇలా జనసేన బలోపేతం కావడం టీడీపీ కొంత మైనస్ అనుకున్నా.. నెంబర్-2 ప్లేస్ లో ఉన్న పవన్ వచ్చే ఎన్నికల సమయానికి నెంబర్-1 అయ్యేలా పావులు కదుపుతున్నారా అనే చర్చలు జోరందుకున్నాయి. ఏదిఏమైనా బీజేపీతో సూపర్ దోస్తీ గల పవన్.. మున్ముందు ఏ అంచనాలతో పార్టీని బలోపేతం చేసుకుంటున్నారో కానీ.. టీడీపీకి మాత్రం క్షేత్రస్థాయిలో కొత్త తలనొప్పులు తెస్తుందన్న అభిప్రాయం టీడీపీ నేతల గుండా వినిపిస్తోంది. జనసేన బలాన్ని అందిపుచ్చుకొని బీజేపీ రాష్ట్రంలో అధికారిక పాగా వేయాలని ప్లాన్-బి అమలు చేస్తే.. పవన్ కి సీఎం సీటు ఖాయమే. మరి ఆ దిశ ఈ రెండు పార్టీల అడుగులు పడుతున్నాయా అనేదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

## లోకేష్ కు పార్టీలో ప్రాధాన్యం...

**గుంటూరు :** నారా లోకేష్ పై కీలక బాధ్యతలు పెట్టారు చంద్రబాబు. పార్టీలో ఇప్పుడు లోకేష్ ప్రాధాన్యత పెరిగింది. అటు ప్రభుత్వంలో కూడా మంత్రిగా ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఉన్నవేళ లోకేష్ సైతం చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. తనపై ప్రత్యర్థులు దుష్ప్రచారం చేసే అవకాశం ఉన్నందున వీలైనంతవరకు.. కూటమి పార్టీలతో సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఒకవైపు పవన్ కళ్యాణ్ తో పాటు జనసైనికులు సైతం సమన్వయం చేసుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన ఢిల్లీ వెళ్లి పెద్దలను కూడా కలిశారు. అయితే ఇదంతా పక్క వ్యూహంతో జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల విషయంపై చర్చించడానికి లోకేష్ ఢిల్లీ వెళ్ళినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పదవుల పంపకం విషయంలో కొన్ని రకాల ఇబ్బందులు ఉన్నాయి. వాటిని చర్చించేందుకే లోకేష్ ఢిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది. చంద్రబాబు నామినేటెడ్ పదవుల విషయంలో లోకేష్ కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఇటు రాష్ట్రంలో జనసేనతో, అటు జాతీయస్థాయిలో ఢిల్లీ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు.టిడిపి విపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేశారు. అప్పట్లో వైసీపీ దూకుడు మీద ఉండేది. టిడిపి శ్రేణులు పై దాడులు కేసులు కొనసాగేవి. పార్టీ నాయకులు చాలా ఇబ్బందులు పడేవారు. ఆ విషయాన్ని స్వయంగా తెలుసుకున్నారు లోకేష్. పాదయాత్రకు సైతం అప్పటి వైసిపి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. ఆ సమయంలో చాలామంది టీడీపీ నేతలు దూకుడుగా వ్యవహరించారు. కేసులను ఎదుర్కొన్నారు. అయితే దారి పొడవునా టిడిపి నేతల పోరాటాలను, వారిపై ఉన్న కేసులను తెలుసుకున్నారు లోకేష్.ఇటీవల చంద్రబాబు నామినేటెడ్ పదవులను ప్రకటించారు. 20 కార్పొరేషన్లకు సంబంధించి అధ్యక్షులను నియమించారు. జనసేన తో పాటు బిజెపికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అయితే పార్టీలో ఇంకా ఆశవాహులు అధికంగా ఉన్నారు. దీంతో చంద్రబాబుకు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు ఎక్కడికి వెళ్తున్నా నేతలు వినతులు ఇస్తున్నారు. దీంతో ఒక రకమైన ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు చంద్రబాబు. ఇప్పటికే పాలనతో పాటు పార్టీ వ్యవహారాలను చూసుకుంటున్నారు. కూటమితో సమన్వయం చేసుకుంటున్నారు. అందుకే ఇప్పుడు నామినేటెడ్ పదవుల వ్యవహారాన్ని లోకేష్ కు అప్పగించినట్లు తెలుస్తోంది.

## ఆ ముగ్గురికే రాజ్యసభ...

**హైదరాబాద్ :** బంపర్ మెజార్టీతో గెలిచినా రాజ్యసభ ప్రాతినిధ్యం లేదు. టీడీపీ నేతలు రాజ్యసభలో అడుగు పెట్టాలంటే మరో రెండుమూడేళ్లు వెయిట్ చేయకతప్పని పరిస్థితి. సరిగ్గా ఇదే సమయంలో ముగ్గురు ఫ్యాన్ పార్టీ రాజ్యసభ సభ్యులు..రిజైన్ చేశారు. సీఎం చంద్రబాబు బాబు మార్క్ పాలిటిక్స్‌తో ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి.మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య తమ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మూడు సీట్లు ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలో ఉన్న బలంగా ఉన్న టీడీపీ కూటమికే దక్కనున్నాయి. దీంతో ఇప్పుడు పెద్దల సభకు వెళ్లే ఆ ముగ్గురు కూటమి నేతలు ఎవరన్నది ఆసక్తికరంగా మారింది.ఏపీ నుంచి 11 మంది వైసీపీ నేతలనే ఎంపీలుగా ఉన్నారు. మొత్తం కోటా అంతా వైసీపీతో భర్తీ అయింది. దాంతో టీడీపీకి ప్రాతినిధ్యం లేదు. ఈ పరిణామంతో నిరాశ చెందిన టీడీపీ అధికారంలోకి రాగానే తన మార్క్ పాలిటిక్స్‌తో పావులు కదిపింది. దానికి తగినట్లుగా వైసీపీ నుంచి రియాక్షన్ వచ్చింది. జగన్ ఎవరి మీద అయితే నమ్మకంతో పదవులు ఇచ్చారో వారే ఫ్యాన్ పార్టీకి బైబై చెప్పి మరీ సైకిలెక్కేందుకు రెడీ అయ్యారు.తమ పదవులను వదిలేసుకున్నారు. మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు సైకిల్ ఎక్కాలనుకుంటే.. ఆర్.కృష్ణయ్య మాత్రం బీజేపీలోకి వెళ్తారని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే ఈ మూడు ఖాళీల్లో చంద్రబాబు ఎవరిని తీసుకుంటారనేది చర్చకు దారి తీసింది. మూడు సీట్లు ఖాళీగా ఉంటే నాలుగురైదుగురు నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. టీడీపీకి దక్కే స్థానాల కోసం ఇటీవల ఎన్నికల్లో సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతిరాజు పేర్లు వినిపిస్తున్నాయి.ప్రచారంలో ఎందరి పేర్లున్నా..పెద్దల సభకు వెళ్లే ఆ ముగ్గురిని చంద్రబాబు సెలెక్ట్ చేశారని తెలుస్తోంది.

టీడీపీకి రెండు ఎంపీలు, జనసేనకు ఒకటి ఇస్తున్నారని అంటున్నారు. ఆ విధంగా తొలిసారి జనసేన పెద్దలసభలో అడుగు పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. టీడీపీ రెండు, జనసేన ఒకటి తీసుకుంటే బీజేపీ పరిస్థితి ఏంటన్నదానిపై క్లారిటీ లేదు. అయితే బీజేపీకి ఈసారికి నచ్చచెబుతారని ఎమ్మెల్సీ కోటాలో చాన్స్ ఇస్తారని అంటున్నారు.ఇక టీడీపీ దక్కే సీట్లలో ఒకటి మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కి, మరొకటి విజయనగరం జిల్లాకు చెందిన కేంద్ర మాజీమంత్రి, సీనియర్ టీడీపీ నేత అశోక్ గజపతిరాజుకు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. క్షత్రియ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని అశోక్ గజపతి రాజును తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఇక గల్లా జయదేవ్ వంటి వారు పెద్దలసభలో అవసరమని చంద్రబాబు భావిస్తున్నారట.ఇక జనసేనకు దక్కే ఒకే రాజ్యసభ సీటులో.. నాగబాబును రాజ్యసభకు పంపాలని పవన్ కళ్యాణ్ డిసైడ్ అయినట్లు నేతలు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నాగబాబు అనకాపల్లి లోక్‌సభ సీటును ఆశించారు. కూటమి పొత్తుల్లో భాగంగా..అనకాపల్లి నుంచి బీజేపీ సీఎం రమేశ్‌కు టికెట్ ఇచ్చారు.అప్పుడు నాగబాబు సీటు త్యాగం చేశారు కాబట్టి ఇప్పుడాయనకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పిస్తారని అంటున్నారు. ఇలా మూడు ఎంపీ సీట్లకు గానూ అభ్యర్థులతో సహా ఎంపికలు పూర్తి అయ్యాయని చర్చ జరుగుతోంది. ఇక ఎన్నికల నోటిఫికేషన్ రావడమే ఆలస్యం ఈ ముగ్గురు నామినేషన్లు వేస్తే ఏకగ్రీవం కావడమే కూడా కన్ఫామే అంటున్నారు కూటమి నేతలు.

## తెగని ధర్మవరం పంచాయితీ

**అనంతపురం :** ధర్మవరం.. ఈ నియోజకవర్గం ఆసక్తికర రాజకీయాలకు కేరాఫ్. ఇప్పుడు మున్సిపల్ కమిషనర్ ఇష్యూతో ధర్మవరంలో ఆ రెండు పార్టీల మధ్య గ్యాప్ క్రియేట్ చేస్తుంది. ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లిఖార్జునను తీసుకురావడం..లోకల్ టీడీపీ క్యాడర్‌కు..లీడర్లకు నచ్చడం లేదు. ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రి సత్యకుమారే మల్లిఖార్జునను తిరిగి మున్సిపల్ కమిషనర్‌గా తెచ్చారని మండిపడుతున్నారు టీడీపీ నేతలు.ప్రస్తుత ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున..గత వైసీపీ హయాంలో కూడా మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అక్రమాలకు మల్లిఖార్జున అండగా నిలిచారని..మున్సిపల్ కమిషనర్ సహకారంతో కేతిరెడ్డి రెచ్చిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే మల్లిఖార్జున తమను ఎంతో ఇబ్బంది పెట్టారని ఆగ్రహంతో ఉంది టీడీపీ క్యాడర్.వైసీపీ కండువా కప్పుకుంటేనే పనులు చేసి పెడతానని హింసించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించారని, నామినేషన్లు కూడా వేయనీకుండా అడ్డుకున్నారని..అలాంటి వ్యక్తికి మంత్రి వత్తాసు పలకడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కష్టపడి గెలిపిస్తే తమ మాటను లెక్క చేయకుండా..అపోజిషన్‌లో ఉన్నప్పుడు తమను ఇబ్బందిపెట్టిన అధికారిని తిరిగి తీసుకొస్తారా అంటూ మండిపడుతున్నారు టీడీపీ నేతలు.ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున నియామకం కూటమిలో అసంతృప్తికి కారణమైంది. ఈ నియామకాన్ని ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే లేటెస్ట్‌గా ధర్మవరం మున్సిపల్ ఆఫీస్‌లో మంత్రి సత్యకుమార్ రివ్యూ మీటింగ్ పెట్టారు. దీనికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కూడా హాజరయ్యారు.అప్పటికే ఆగ్రహం మీదున్న టీడీపీ శ్రేణులు కమిషనర్‌ను లోపలికి వెళ్లకుండా అడ్డుకునేందుకు రెడీ అయ్యారు. విషయం తెలుసుకున్న సత్యకుమార్ ఎన్డీయే కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున మంత్రి క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుని పెద్దఎత్తున నినాదాలు చేశారు.

## పట్టభద్రుల లెక్క తేల్చేసారా....

**విజయవాడ :** ఏపీలో ఎన్నికల ఫలితాలు ఇచ్చిన షాక్ నుండి వైసీపీ కొంచెం త్వరగానే తేరుకున్నట్లు ఉంది. అందులో భాగంగా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించిందనే వాదన వినిపిస్తోంది. అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ఇంకా ఆలోచన చేయక మునుపే వైసీపీ అభ్యర్థిని అప్పుడే రంగంలోకి దించింది. ఇంతకు ఏపీలో జరగనున్న ఎన్నికలు ఏంటి ? వైసీపీ స్పీడ్ ఎందుకు ? అసలు ఆ అభ్యర్థి ఎవరనే విషయాలు తెలుసుకుందాం.ఏపీలో కృష్ణా-గుంటూరు, తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. సాధారణంగా ఈ స్థానాలు మార్చిలోనే ఖాళీ కాగా.. ఎన్నికల కమిషన్ ప్రస్తుతం ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతోంది. అందులో భాగంగా ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించగా.. ఓటర్లు నమోదు ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఇది ఇలా ఉంటే ఏపీలో సాధారణ ఎన్నికల తరువాత జరగనున్న తొలి ఎన్నికలు ఇవే. ఇప్పటికే గత ఎన్నికల్లో భారీ ఓటమి చవిచూసిన వైసీపీ ఈసారి కొంత తొందరగానే తేరుకుంది. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలను తన ఖాతాలో వేసేందుకు వైసీపీ ఇప్పటి నుండే తన వ్యూహాన్ని అమలు పరుస్తోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయాన్ని అందుకొని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని చాటిచెప్పాలన్నదే వైసీపీ వ్యూహంగా కనిపిస్తోంది. అందుకే ఆయా జిల్లాల పరిధిలోని వైసీపీ నేతలను మాజీ సీఎం జగన్ అప్రమత్తం చేసి, ఇప్పటికే విజయావకాశాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారట. గుంటూరు-కృష్ణా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసీపీ నేత, సీనియర్ నాయకుడు పొన్నూరు గౌతంరెడ్డి పేరును ఖరారు చేస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది.ఇది ఇలా ఉంటే టిడిపి కూటమి మాత్రం ఇప్పటికీ అభ్యర్థిని ఎంపిక చేసే ప్రయత్నాల్లో కూడా లేనట్లే ఉంది. అయితే వైసీపీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు టీడీపీ వ్యూహంలో ఉందని సమాచారం. ఈ ఎన్నికలు ఇరు పార్టీలకు ప్రాధాన్యత సంతరించుకొని ఉండగా.. గెలుపు సాధనకు ఇప్పటి నుండే పార్టీలు సిద్ధమవుతున్నాయి. అయితే వైసీపీ మాత్రం ఈ ఎన్నికల్లో విజయం మనదే కావాలన్న రీతిలో ఇప్పటికే లోకల్ నాయకులతో సమావేశమైంది. ఇలా వైసీపీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్పీడ్ కాగా.. టీడీపీ స్లోగానే అడుగులు వేస్తోంది. టీడీపీ అభ్యర్థిని రంగంలోకి దింపితే మాత్రం స్పీడ్ పెంచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. మొత్తం మీద ఈ ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారో కానీ.. గెలుపు మాత్రం పార్టీలకు కీలకం కానుంది.

## కొలికపూడికి నోటీసులు

**విజయవాడ :** టిడిపి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహార శైలి ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అమరావతి ఉద్యమ నేతగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. గత ఐదేళ్లుగా గట్టిగానే వాయిస్ వినిపించారు. అందుకే చంద్రబాబు పిలిచి మరి తిరువూరు టికెట్ కేటాయించారు. ఆయన గెలుపు కష్టమని అంతా భావించారు. కానీ టిడిపి తో పాటు కూటమి సమన్వయంతో పనిచేయడంతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే తన గెలుపునకు కృషి చేసిన సొంత పార్టీ శ్రేణులకి ఇబ్బందులకు గురి చేస్తున్నారు కొలికపూడి. ఇలా గెలిచారో లేదో యంత్రాలతో సిద్ధమయ్యారు. ఓ వైసీపీ నేత ఇంటిని నేలమట్టం చేశారు. డ్వాక్రా మహిళా సంఘాలను గంటల తరబడి పోలీస్ స్టేషన్లో పెట్టించారు. అంతటితో ఆగకుండా టిడిపి సర్పంచ్ పై వేధింపులకు పాల్పడ్డారు. దీంతో సర్పంచ్ భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో సంచలనం గా మారింది. దీంతో టీడీపీ శ్రేణులు రోడ్డెక్కాయి. ఏకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదులు ఇచ్చాయి. ఈ ఎమ్మెల్యే వద్దని.. ఇన్చార్జిని నియమించాలని డిమాండ్ చేశాయి. అధికారం చేతిలో ఉంది కదా అని ఆయన రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఒకసారి చంద్రబాబు పిలిచి మాట్లాడారు. ఇప్పుడు మరోసారి పిలిపించి గట్టి హెచ్చరికలే పంపారు. అయితే ఇప్పటికే కొలికపూడి నియోజకవర్గంలో దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఏకంగా మీడియాలో ఆయనకు వ్యతిరేకంగా కథనాలు వస్తుండడం విశేషం.తిరువూరు నియోజకవర్గంలో పేకాట శిబిరాల ఏర్పాటులో కొలికపూడి హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో ఎక్కువ వాటాలు డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. ఒకవేళ ఎవరైనా ఇవ్వకుంటే కేసుల అస్త్రం ప్రయోగిస్తున్నట్లు సమాచారం. ఇటీవల చిట్టేల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు పై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడంతో.. ఆయన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎన్నికల కోసం ఒకరి దగ్గర కోటి రూపాయలు అప్పు చేశారని.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 20 లక్షల రూపాయలు చెల్లించి.. దిక్కున చోట చెప్పుకోమని అన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.తాజాగా ఎమ్మెల్యే కొలికపూడిపై లైంగిక ఆరోపణలు కూడా రావడం విశేషం. ఏదైనా పనితో అతని దగ్గరకు వెళ్తే మహిళలను లైంగికంగా ఇబ్బందులు పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మహిళ అధికారులు, ఉద్యోగులు ఆయన దగ్గరకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే ఆగడాలు మితిమీరడంతో ఇటు టిడిపి కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజల్లో కూడా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. టిడిపి శ్రేణులు రోడ్డు ఎక్కి నిరసన తెలుపుతున్నాయి. ఇటీవల రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్ల శ్రీనివాస్ రావును కలిసిన వారు సమస్యను విన్నవించారు. పార్టీకి నష్టం కలిగించడంతో పాటు క్యాడర్ ని, ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దీనిపై సీరియస్ గా దృష్టి సారించారు చంద్రబాబు. ఎమ్మెల్యే కొలికపూడిని పిలిచి మరి మాట్లాడారు. ఎమ్మెల్యే పనితీరుపై చంద్రబాబు పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

## తెలుగు రాష్ట్రాల్లో ఒకే తేదిన
# తెలుగు పండుగలు

- పండుగల విషయంలో గందరగోళ పరిస్థితి తలెత్తకుండా సిద్ధాంతుల సమిష్టి నిర్ణయం
- సంప్రదాయ సిద్ధాంతాలను పాటిస్తూ సమాజానికి, ప్రభుత్వాలకు మేలు జరిగేలా సమిష్టి నిర్ణయం
- ఉభయ వేదాంతాచార్య పీఠ ఆస్థాన సిద్ధాంతులు ఉ.వే.తి.న.చ సంపత్ కుమార కృష్ణమాచార్య సిద్ధాంతివెల్లడి



**హైదరాబాద్** పండుగల విషయంలో గందరగోళ పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సంప్రదాయ సిద్ధాంతాలను పాటిస్తూ సమాజానికి, ప్రభుత్వానికి మేలు జరిగేలా సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు ఉభయ వేదాంతాచార్య పీఠ ఆస్థాన సిద్ధాంతులు ఉ.వే.తి.న.చ సంపత్ కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి(శ్వాస్) అధ్యక్షుడు మంగళగిరి యాదగిరి స్వామి తెలిపారు. సనాతన శాస్త్ర ప్రమాణాల ఆధారంగా విశ్వావసు సంవత్సర(2025-26)లో జరుగబోయే సాధారణ పండుగలు, విశేష పర్వదినాల తేదీలను నిర్ణయించి నట్లు వారు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల శంషాబాద్ లోని ముచ్చింతల్లో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి సమక్షంలో విశ్వావసు పంచాగ సిద్ధాంత నిర్ణాయక సభ జరిగిందని, ఈ సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దివ్య క్షేత్రాల ఆస్థాన సిద్ధాంతులు, వివిధ పీఠాల ఆస్థాన సిద్ధాంతులు, ఇతర ప్రముఖ సిద్ధాంతులు 76 మంది హాజరై సమాజ శ్రేయస్సు, సనాతన ధర్మ వ్యాప్తిపై విపులంగా చర్చించినట్లు చెప్పారు. పండుగల విషయంలో గందరగోళ పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సంప్రదాయ సిద్ధాంతాలను పాటిస్తూ సమాజానికి, ప్రభుత్వానికి మేలు జరిగేలా సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు తెలుగు రాష్ట్రాల సీఎంలను కలిసి తాము తీసుకున్న నిర్ణయాలు తెలిపి ఆమోద పత్రాలను అందజేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రతినిధులు వెంకట కిషోర్, సౌమిత్రి శ్రీధర్ స్వామి, వరద స్వామి, వేణుస్వామి, ఆచార్య ఆత్రేయ, గోవర్ధనం, వెంకట రమణాచార్య పాల్గొన్నారు.

## అర్హులకు పింఛన్లు అందజేసిన
# గురజాల ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల :** పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని1వ వార్డు (చంద్రపాలెం), 31వ వార్డు, 32వ వార్డు, 33వ వార్డు లకు చెందిన అవ్వ తాతలకు, వితంతు వులకు, విభిన్న ప్రతిభవంతులకు యరపతినేని పింఛన్లను అందచేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ పర్వతినేని శ్రీధర్, మరియు ప్రభుత్వ సిబ్బంది, పింఛన్ లబ్ధిదారులు, పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కు చెందిన రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గం, మండలం, వార్డు స్థాయిల్లో వివిధ హోదాల్లో వున్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

# సిట్ దర్యాప్తుకు బ్రేక్

**తిరుమల :** తిరుమల లడ్డూ కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.. లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.. మరోవైపు సుప్రీంకోర్టులో సైతం విచారణ జరుగుతోంది.. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకుంది. కల్తీ నెయ్యి వివాదంపై సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 3వరకు సిట్ దర్యాప్తు నిలిపివేస్తున్నట్లు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. కాగా.. సోమవారం లడ్డూ వివాదంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. దీనిపై స్వతంత్ర దర్యాప్తు సంస్థ చేత విచారణ జరిపించాలని వైవీ సుబ్బారెడ్డి తరపు లాయర్లు వాదించారు. దీనిపై అభిప్రాయం చెప్పాలని కేంద్రాన్ని ఇప్పిటికే కోర్ట్ కోరింది. గురువారం మధ్యాహ్నం దీనిపై విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో సిట్ విచారణను తాత్కాలికంగా వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. వాస్తవానికి దర్యాప్తు ఆపాలని కోర్టు ఆదేశించలేదు. కానీ ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు సిట్ విచారణ 3వ తేదీ వరకూ నిలిపివేస్తున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

కేసు విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందని.. సర్వోన్నత న్యాయస్థానం పరిధిలో ఈ కేసు ఉన్న నేపథ్యంలో ఎక్కవ వివరాలు చెప్పలేమని తెలిపారు.అయితే ఇప్పటిదాక సిట్ క్షేత్రస్థాయిలో కొంతమేర దర్యాప్తు చేపట్టింది. టీటీడీకి నెయ్యి సరఫరా అవుతున్న విధానం, వినియోగిస్తున్న తీరు లాంటి అంశాలపై సిట్ దర్యాప్తు చేసింది. సర్వోన్నత న్యాయస్థానంలో 3న కేసు విచారణ జరుగుతుంది. ఆ తరువాత ధర్మాసనం డైరెక్షన్ మేరకు వ్యవహరిస్తామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు.తిరుమలలో మీడియా సమావేశం నిర్వహించిన డీజీపీ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 4 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజారోహణం రోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో సెక్యూరిటీ కి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాలు, మొబైల్ డివైజ్ ద్వారా ఫింగర్ ప్రింట్ టెక్నాలజీని వినియోగిస్తామన్నారు. ట్రాఫిక్, పార్కింగ్ విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని.. ఆర్టీసీ అదనపు బస్సులు యాత్రికులకు అందుబాటులో ఉంటాయని.. డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు.

# ట్రోలింగ్ పై సర్కార్ సీరియస్

**హైదరాబాద్ :** ఇటీవల సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న వార్తలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. అభ్యంతరమైన భాషతో కొందరు నేతలను టార్గెట్ చేసి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ కాంగ్రెస్ నేతలను టార్గెట్‌గా చేసుకొని పెడుతున్న వీడియోలను వైరల్ చేస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని సీరియస్‌గా తీసుకుంది. అదే పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్న యూట్యూబ్ ఛానెల్స్‌పై కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.వాస్తవ పరిస్థితులకు భిన్నంగా అసత్య ప్రచారాలు చేస్తూ పలు అంశాలకు కాంగ్రెస్ పార్టీని కార్నర్ చేసి కొన్ని యూట్యూబ్ ఛానల్ అదేపనిగా వీడియోలు తీస్తున్నారు. వీటితోపాటు తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పించడమే ధ్యేయంగా పెట్టుకొని, నోటికి వచ్చినట్లు కాంగ్రెస్ నాయకులను తిట్టిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో అలాంటి యూట్యూబ్ ఛానల్స్‌పై మరింత కఠినంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ సర్కార్ రెడీ అయ్యింది. అలాంటి వీడియోలు పోస్ట్ చేస్తున్న వారిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.గత కొద్ది రోజులుగా హైడ్రా పై తీవ్రస్థాయిలో ఫేక్ వీడియోలు సర్క్యూలేట్ అవుతున్నాయి. ఎక్కడ కూల్చివేతలు జరిగినా వాటిని హైడ్రాకు అంటగట్టిస్తున్నారు. కొన్నిచోట్ల హైడ్రాకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ అక్కడ కూలుస్తున్న రెవెన్యూ అధికారులను వదిలేసి వాటికి హైడ్రాకు ముడి పెడుతున్నారు. ఫలితంగా ఆక్రమణల తొలగింపు, మూసి ప్రక్షాళన కార్యక్రమాలపై హైడ్రా పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు మరింత దిగజారి బాధితులు మాట్లాడిన దుర్భాషను ఎలాంటి ఎడిటింగ్ లేకుండా యూట్యూబ్ లలో అప్లోడ్ చేస్తూ వైరల్ చేసి ట్రెండింగ్ లో ఉండేలా చూస్తున్నారు.కొన్ని సందర్భాల్లో ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మహిళా మంత్రులను టార్గెట్‌గా, వారిపై ఘోరమైన విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలలో వీడియోలు అప్లోడ్ చేస్తున్నారు.

ఒక సీఎం హోదాలో ఉన్న వ్యక్తిపై అదే పనిగా తిట్టించడం, పైగా ఆ వీడియోను ఎలాంటి ఎడిటింగ్ చేయకుండా అలానే సోషల్ మీడియాలో పెడుతూ ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఘటనలు కూడా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆపాదిస్తూ సంబంధం లేని అంశాలకు రేవంత్ సర్కార్‌ను బదనాం చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇటీవల చోటు చేసుకున్న ఇలాంటి పలు సంఘటనలు ఉదాహరిస్తూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు.యూట్యూబ్ ఛానల్ పేరుతో సమస్యలను చూపించడంలో తప్పులేదు.. కానీ, అదే పనిగా ఒక ప్రాంతానికి వెళ్లి సంబంధం లేని విషయాలను ప్రభుత్వానికి ఆపాధించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టడమే లక్ష్యంగా పెట్టుకొని బాధితులతో ప్రభుత్వాన్ని బూతులు తిట్టిస్తున్నారు. మహిళా మంత్రులు అని కూడా చూడకుండా కొంతమందితో అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారు. కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ పై ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీడియోలకు సంబంధించిన లింకులు జతపరుస్తూ ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయగా, పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు మరికొంతమంది కోసం గాలిస్తున్నారు.

ఇక తాజాగా మంత్రి కొండా సురేఖ పై ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేసిన వ్యక్తులను ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సోషల్ మీడియాలో ట్రోలింగ్ లను చూసి మంత్రి కొండా సురేఖ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కంటతడి పెట్టుకున్నారు. ఇలాంటి సోషల్ మీడియా ప్రజలకు ఏమాత్రం అవసరం లేదని, ప్రజలకు మంచి చేయడానికి వాటిని ఉపయోగించాలి తప్ప, అడ్డదారుల్లో ట్రోలింగ్ చేసి, లేని ఘటనను ప్రభుత్వానికి ఆపాదించడం మానుకోవాలని అటు ప్రభుత్వం, ఇటు పోలీసులు సోషల్ మీడియా ట్రోలర్స్‌కి, యూట్యూబ్ ఛానల్స్ కు కఠిన హెచ్చరికలు జారీ చేస్తున్నారు

## అదిలాబాద్‌లో
# ఘోర రోడ్డు ప్రమాదం

**అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి కార్నర్ సమీపంలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్‌ను కారు ఢీకొట్టి కొద్దిదూరం వెళ్లి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదురుగు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లా భైంసా నుంచి ఎనిమిది మందితో ఆదిలాబాద్ వస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న వారిలో మొయిజ్ (60), అలీ(8), ఖాజా మొయినుద్దీన్ (40), మహమ్మద్ ఉస్మానుద్దీన్ (11) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో గాయపడ్డ ఫరీద్ (12) రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ మిగతా వారినీ 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతులు, క్షతగాత్రులంతా ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీ వాసులు. వీళ్లంతా ఒకే కుటుంబానికి చెందిన రక్త సంబందికులు. గాయపడ్డ వారికి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోలీసులు కేసు నమోదు చేసుకొని పంచనామా నిర్వహించి మార్చురీకి తరలించారు. ఈ మేకలగండి కార్నర్ సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది సైతం ఓ కుటుంబం ఇలాగే ప్రమాదంలో చనిపోయారు. ఏడాదిపాటున ఇక్కడ పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అనేక మంది మృత్యువాత పడుతున్నారు. గుడిహత్నూర్ నుంచి సీతాగొంది వరకు గుట్ట ప్రాంతం డౌన్ లెవెల్‌లో ఉండడం వల్ల ఎక్కువగా చాలామంది న్యూట్రల్ లో వెళుతూ ఉంటారు. భారీ వాహనాలు అయితే న్యూట్రల్లో వెళుతూ కంట్రోల్ లేకుండా ఒక్కోసారి ఎదురుగా వచ్చిన వారిని ఢీకొంటూ వెళ్ళిపోతుంటాయి. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. మేకలగండి కార్నర్‌లో జరిగే ప్రమాదాల్లో జాతీయ రహదారి అధికారుల భద్రత వైఫల్యం.. రవాణా శాఖ అధికారుల లోపం కూడా ఉన్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. వీరిపై చర్య తీసుకునేలా రోడ్డు ప్రమాదాలు జరగకుండా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

## చిన్నారిని చిదిమేసిన
# స్కూల్ బస్సు

**కరీంనగర్ :** బతుకమ్మ పండగ పూట ఆ ఇంట విషాదం నిండింది. సంబరాలకోసం ముస్తాబైన చిన్నారి అంతలోనే బస్ ప్రమాదంలో మృత్యువాతపడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోనీ మహర్షి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విషాద సంఘటన చోటు చేసుకుంది. నామపూర్ గ్రామానికి చెందిన సల్కం భూమయ్య- వెంకటవ్వ కూతురు మనోజ్ఞ విద్యార్థిని మహర్షి పాఠశాల లో నర్సరీ చదువుతుంది. ఆ చిన్నారి ప్రతి రోజూలాగే ఉత్సాహంగా స్కూలుకు బయలుదేరింది. ఉదయం పూట నామాపూర్ గ్రామంలో బస్ ఎక్కిన మనోజ్ఞ అక్కడి నుండి స్కూల్ చేరుకుంది. అయితే స్కూల్ లో బతుకమ్మ సెలబ్రేషన్ ఉండడం తో అందుకు అనుగుణంగా రెడీ అయ్యి వచ్చింది.ఉదయం స్కూల్ బస్ దిగిన క్రమంలో చిన్నారి జడలో పెట్టుకున్న పువ్వు కింద పడడంతో ఆ పువ్వును తీసుకోవడానికి కిందికి వంగింది. అది గమనించని డ్రైవర్ వ్యాన్ ని ముందుకు తీస్తున్న సమయంలో విద్యార్థిని మను తల పై నుండి వ్యాన్ వెనుక టైర్లు వెళ్లడంతో తల నుజ్జు నుజ్జు అవ్వడం తో అక్కడికక్కడే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న పాప అప్పుడే తయారై వెళ్లిన తమ పాప చనిపోయిందని విషయం తెల్సిన తల్లి రోదనలు మిన్నంటడంతో అక్కడ పాఠశాలలో అందరిని కలచి వేసింది. విషయం తెలుసుకున్న బంధువులు పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు. మాకు బస్ డ్రైవర్ ను అప్పగించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అడ్డుకోవడంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది.పరిస్థితి అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ప్రయత్నించినప్పటికీ ఆందోళన విరమించలేదు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు చేరుకొని డిఎస్పీ చంద్రశేఖర్ వారిని సముదాయించి మీకు న్యాయం చేశారని హామీ ఇవ్వడంతో ఆందోళను విరమించించారు.అప్పటికే చేరుకున్న విద్యార్థి సంఘాలు విద్యార్థినికి న్యాయం చేయాలని, వెంటనే స్కూల్ సీజ్ చేయాలని ఆందోళన చేశారు. పాఠశాల కరస్పాండెంట్ విదేశాల్లో ఉండటం వలన పాఠశాలను పట్టించుకోకపోవడం వల్లనే ఇంతటి దారుణం జరిగిందని బంధువులు, ఆరోపించారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడిన కుటుంబ సభ్యులు నష్టపరిహారం చెల్లిస్తామని బస్ కు ఇన్సూరెన్స్ ఉందని చెప్పడం తో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు శాంతించారు.విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇలాంటి స్కూల్ ని వెంటనే సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. న్యాయం చేయాలని వారు డిమాండ్ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న జిల్లా విద్యాధికారి రమేష్ వెంటనే స్పందించి స్కూల్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యాన్ డ్రైవర్, క్లీనర్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రాణాలు తీసిన డెంగ్యూ..

**అదిలాబాద్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను డెంగ్యూ జ్వరం వణికిస్తోంది. డెంగ్యూ బారిన పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. డెంగ్యూ జ్వరంతో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం లోకేశ్వరం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భాగపూర్ గ్రామానికి చెందిన బైరి శ్రీలత ఐదు రోజులుగా డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మహిళ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.అటు, కుబీర్ మండలంలోని వర్ని గ్రామానికి చెందిన కొండిరాం అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా తీవ్రమైన జరంతో బాధ పడుతున్నాడు. పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ అని తేలింది. మెరుగైన చికిత్స కోసం బైంసాకు బయల్దేరాడు. ఈ క్రమంలోనే అలసి పోయి ఓ చోట చెట్టుకింద కూర్చున్నాడు. అక్కడికక్కడే మృతి చెందాడు.ఇదిలా ఉంటే, పల్లెల్లో పరిశుభ్రతపై తక్షణ చర్యలు చేపట్టారు అధికారులు. వీధులు, మురికి కాల్వ నిర్వహణ, రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లటంపై దృష్టి సారించారు. ప్రజలకు కూడ పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో ఇంట్లో ఎక్కడా నీరు పేరుకుపోకుండా చూసుకోవాలి. ఇది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే దోమల నుండి మిమ్మల్ని కాపాడుతుందని చెప్పారు. అలాగే, ఆహారం విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. సులభంగా జీర్ణమయ్యే ఆరోగ్యకరమైన, తేలికపాటి భోజనం తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకూ కాచి, చల్లార్చిన నీటినే తరచూ తాగుతూ ఉండాలని చెప్పారు.

# ఆర్టీసీలో 3 వేల ఉద్యోగాలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీలో త్వరలో 3 వేల ఉద్యోగాలకు ప్రకటన వెలువరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తాజాగా కరీంనగర్‌లో 33 విద్యుత్ బస్సులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మేరకు వెల్లడించారు. ఆయన ఇంకా ఈ విధంగా మాట్లాడారు. ఇప్పటివరకు ఎంతో మంది మహిళలు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. మహిళా శక్తి, మెప్మా ద్వారా మరిన్ఇన ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేస్తామన్నారు.ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ, కారుణ్య నియామకాలపై దృష్టి పెడతామని చెప్పారు. విద్యుత్ బస్సుల కొనుగోలుకు జేబీఎం సంస్థతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ విద్యుత్ బస్సు సర్వీసులను నడపాలన్నదే తమ ప్రభుత్వం ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ రింగ్ రోడ్డు లోపల డీజిల్‌తో నడిచే బస్సు ఒక్కటి కూడా ఉండకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాపాలన ఏర్పడిన తర్వాత విప్లవాత్మక మార్పులు చేస్తూ ఆర్టీసీని దినదినాభివృద్ధి చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 604 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆయా జిల్లాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర పోస్టులను పొరుగుసేవల ద్వారా భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు అక్టోబరు 10 చివరి గడువు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో చెక్ చేసుకోవచ్చు. ఇంగ్లిష్, సివిక్స్, కామర్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఒకేషనల్ సబ్జెక్టులో టీజీటీ ఖాళీలు, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో సీఆర్టీ ఖాళీలు ఉన్నాయి.

# సెకండ్ టెస్ట్‌లో భారత్ గెలుపు

**చెన్నై :** భారత జట్టు అద్భుతం చేసింది. కేవలం రెండున్నర రోజుల్లోనే టెస్టు మ్యాచ్ గెలిచి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. అది కూడా పాకిస్థాన్ ను వారి సొంతగడ్డపైనే మట్టికరిపించి.. సిరీస్ ను క్లీన్ స్వీప్ చేసిన బంగ్లాదేశ్ పప్పులు.. టీమిండియా ముందు ఉడకలేదు. తొలి రోజు 35 ఓవర్లే పడ్డా... రెండు రోజుల ఆట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయినా... వరుణుడు ఆటంకం కలిగించినా.. భారత జట్టు విజయాన్ని ఆపలేక పోయాడు. మ్యాచ్ డ్రా కావడం ఖాయమని అంతా అనుకున్న వేళ.. రోహిత్ సేన ఘన విజయం సాధించింది.స్వదేశంలో తామెంత బలమైన జట్టు మరోసారి టీమిండియా నిరూపించింది. కాన్పూర్‌లో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్‌పై భారత బౌలర్లు పంజా విసిరారు. తొలి ఇన్నింగ్స్ లో బంగ్లాదేశ్ ను కేవలం 233 పరుగులకే కుప్పకూల్చిన భారత బౌలర్లు... రెండో ఇన్నింగ్స్ లో మరింత దూకుడు ప్రదర్శించారు. బంగ్లా బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టి 146 పరుగులకే ఆలౌట్ చేశారు. దీంతో టీమిండియా ముందు కేవలం 95 పరుగుల లక్ష్యం నిలిచింది. యశస్వి జైస్వాల్ అర్ధ సెంచరీతో మరోసారి చెలరేగడంతో టీమ్ ఇండియా ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

**రెండో ఇన్నింగ్స్ ఇలా..** ఓవర్ నైట్ స్కోరు 26/2 వద్ద అయిదో రోజు ఆటను ఆరంభించిన బంగ్లాదేశ్..146 పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్ లో బంగ్లా బ్యాటర్లకు టీమిండియా బౌలర్లు చుక్కలు చూపించారు. బంగ్లాను కేవలం 146 పరుగులకే కుప్పకూల్చారు. బంగ్లా బ్యాటర్లలో షద్మాన్ ఇస్లామ్ (50), ముష్ఫికర్ రహీమ్ (37) మినహా ఎవరూ రాణించలేదు. భారత్ బౌలర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా తలో మూడు వికెట్లు తీశారు. దీంతో భారత్ ఎదుట 95 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లా ఉంచింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 233 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్ 285/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా 95 పరుగుల లక్ష్యాన్ని సునాయసంగా ఛేదించింది.యసశ్వీ జైస్వాల్ అర్ధ సెంచరీతో మరోసారి చెలరేగాడు. 51 పరుగులు చేసి జైస్వాల్ అవుటయ్యాయాడు. విరాట్ కోహ్లీ 29 పరుగులతో నిలబడ్డాడు. దీంతో కేవలం 17.2 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్ ను భారత జట్టు 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఈ సిరీస్ క్లీన్ స్వీప్ చేయడంతో భారత జట్టు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. వచ్చే ఎనిమిది టెస్టుల్లో మరో మూడు మ్యాచులు గెలిచినా భారత జట్టు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరడం ఖాయం.

**ఈ విజయం అద్భుతం** మాములుగా అయితే బంగ్లాదేశ్ పై భారత విజయం సాధారణంగా గొప్ప విషయం కాదు. కానీ పాకిస్థాన్ లో గెలిచి భారత గడ్డపై కాలుమోపిన బంగ్లాదేశ్ ను కేవలం రెండున్నర రోజుల్లోనే మట్టి కరిపించడం మాత్రం టెస్టుల్లో భారత ఆధిపత్యాన్ని మరోసారి చాటింది. రెండు రోజులు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయినా.. కఠినమైన వేడి పరిస్థితుల్లో బౌలింగ్ చేసిన తర్వాత తాము విజయం సాధించడం శుభ పరిణామమని బుమ్రా అన్నాడు. కాన్పూర్ పిచ్ చెన్నైలో ఉన్నదానికి పూర్తిగా భిన్నంగా ఉందని బుమ్రా తెలిపాడు. అనుభవం, అంకిత భావంతోనే ఈ విజయం సాధించామని తెలిపాడు. ఆకాశ్ దీప్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని.. ఫీల్డ్‌లో, బౌలింగ్‌లో చురుగ్గా ఉన్నాయని బుమ్రా తెలిపాడు.

# పాపం యువజంట

**ఖమ్మం :** చదువుకోని వాళ్లు మాయగాళ్ల వలలో పడుతున్నారంటే జాలీ పడవచ్చు..! కానీ చదువుకుని డిగ్రీలు చేత పట్టుకుని ఉద్యోగాల కోసం లక్షల్లో డబ్బులు కట్టి మోసపోతున్నారు. కట్టిన డబ్బులు తిరిగిరాక, ఉద్యోగం రాదని తెలిసి ఆ దంపతులు కుంగిపోయారు. చివరికి అవమాన భారంతో దంపతలిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, సాయిరాంతండాకు చెందిన హాలవత్ రత్నకుమార్, పార్వతీ యువ జంట కొత్తగూడెంలోని ఒక వస్త్రాలయంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. సింగరేణిలో ఉద్యోగం చేయాలని భావించారు. ఇందుకు మధ్య దళారిని నమ్మారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన కరీంనగర్‌కు చెందిన వ్యక్తి మాయలో పడ్డారు. నెల నెలా కొంచెం డబ్బు కూడబెట్టి, 16 లక్షలు పోగు చేసిన సొమ్మును అతనికి అప్పజెప్పారు. ఉద్యోగం కోసం ఎదురు చూడసాగారు. ఇంతలోనే కరీంనగర్ చెందిన సదరు వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో దిక్కుతోచనిస్థితిలో పడ్డారు ఆ దంపతులు.ఉద్యోగం ఇప్పిస్తానన్న వ్యక్తి మృతి చెందడంతో చేసేదీ లేక, ఇచ్చిన డబ్బులు తిరిగిరావని తెలుసుకుని ఆత్మహత్యే శరణ్యం అనుకున్నారు. ఇద్దరూ పురుగు మందు సేవించి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వారిని కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి ఖమ్మంకు, ఖమ్మం నుండి హైదరాబాద్ కు తరలించారు. అయినప్పటికీ వారిని కాపాడలేకపోయారు. దంపతులిద్దరూ గంటల వ్యవధిలో మృతి చెందడంతో బంధువులు గుండెలు పగిలేలా రోదిస్తూన్నారు. దీంతో విషయం తెలుసుకున్న చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబో

## - చిత్రంలో సప్తసరాగాలు దాటి.. ఫేం రుక్మిణి వసంత్





గ్లోబల్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీకి సీక్వెల్ కూడా రాబోతుంది. కాగా మరోవైపు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఎన్టీఆర్ 31 కూడా లాంఛ్ చేసి అభిమానులకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పాడు. ఆగస్టులో హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ఈ మూవీ లాంచింగ్ ఈవెంట్ కూడా గ్రాండ్‌గా జరిగింది. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఇప్పుడు రెండు వార్తలు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి.

ఈ చిత్రంలో సప్తసరాగాలు దాటి ఫేం రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట. దీనిపై అధికారిక ప్రకటన రావడమే తరువాయి అని ఇన్‌సైడ్ టాక్.అంతేకాదు ఈ చిత్రం బంగ్లాదేశ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథతో ఉండబోతున్నట్టు ఇంకో వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. బంగ్లాదేశ్‌కు వలస వెళ్లిన తెలుగు వాళ్లకు అండగా నిలిచే పాత్రలో తారక్ కనిపిస్తాడట. మొత్తానికి ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా ప్రేక్షకులకు రీచ్ అయ్యేలా సినిమాను సిద్దం చేస్తున్నాడని తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. ఈ క్రేజీ వార్త అఫీషియల్ కానప్పటికీ మూవీ లవర్స్, ఫ్యాన్ మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు.ఐ

# ప్రభాస్ మూవీలోకి మిథున్ చక్రవర్తి

సలార్', 'కల్కి' సినిమాల సక్సెస్‌తో రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రభాస్ నెక్ట్స్ లైనప్‌తో కూడా ఫ్యాన్స్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీతారామం చిత్రంతో నేషనల్ వైడ్‌గా క్రేజ్ సంపాదించుకున్న డైరెక్టర్ హను రాఘవాపుడితో ఓ సినిమా చేయనుండటం ఫ్యాన్స్‌కి మరింత కిక్కునిచ్చింది. ఫౌజి వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే ఈ సినిమాలో యూట్యూబ్ సెన్సేషన్ ఇమాన్వి ఇస్మాయిల్ తో పాటు లెజండరీ నటి జయప్రద నటించనుడటంతో సినీవర్గాలల్లో మూవీపై మరింత ఇంట్రెస్ట్ పెరిగింది. తాజాగా మరో లెజెండ్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రకటించడటంతో ఫ్యాన్స్ మరింత సంబరపడిపోతున్నారు. ఇటీవల రిలీజైన 'కల్కి 2898 సినిమాలో బాలీవుడ్ సూపర్ స్టార్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ప్రభాస్ కోసం నటించి మెప్పించాడు. కేవలం యాక్ట్ చేశాడన్నట్లు కాకుండా సినిమాకే ఆయువు పట్టులా వ్యవహరించి తన యాక్టింగ్ ఇంప్యాక్ట్ చూపించాడు. తాజాగా భారతదేశ చలన చిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ పాల్కె అవార్డ్ పొందిన మిథున్ చక్రవర్తిని హను రాఘవపూడి ఫౌజి సినిమా కోసం కాంటాక్ట్ అయ్యారు. ఆయన కూడా ఈ ప్రాజెక్ట్ కి ఓకే చెప్పేశారు.ఐ

దీంతో మరోసారి ఇంకో బాలీవుడ్ లెజెండ్ ప్రభాస్ సినిమాలో కీలకం కానున్నాడు. గతంలో 'గోపాల గోపాల' చిత్రంలో నెగిటివ్ షేడ్స్‌లో తన నటన ప్రావీణ్యంతో తెలుగు ప్రజలకు ఆయన పరిచయమే. గోపాల గోపాల ఒరిజినల్ వెర్షన్ ఓ మై గాడ్ మూవీలోను ఇదే పాత్రలో ఆయన నటించి అవార్డులు సాధించారు. అలాగే దేశంలోనే మూడో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌తో పాటు 3 నేషనల్ అవార్డులు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సాధించారు. కాగా ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా సుదీప్ ఛటర్జీ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

## నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు..

# 'అన్‌మ్యాచ్‌బుల్'

## - రామ్‌చరణ్‌కు సమంత కితాబు






హీరో

రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ నుంచి తాజాగా 'రా మచ్చా మచ్చా..' అంటూ రెండో పాట విడుదలైంది. ఈ పాట ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ క్రమంలో పాటలో రామ్‌చరణ్ డ్యాన్స్‌పై ఉపాసన, సమంతలు ప్రశంసలు కురిపించారు. రామ్‌చరణ్ తన పాటను షేర్ చేస్తూ.. 'ఈ భారీ పాటను నేను ఆనందించినట్లు.. మీరూ ఆనందిస్తున్నారని ఆశిస్తున్నా' అని రాశారు. ఈ పోస్ట్‌పై ఉపాసన స్పందిస్తూ.. మిస్టర్ సీ.. మీ డ్యాన్స్‌తో హై ఓల్టేజ్ పుట్టించారని రిప్లై ఇచ్చారు. ఇక, సమంత స్పందిస్తూ.. నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు అంటూ.. 'అన్‌మ్యాచ్‌బుల్' అని పేర్కొన్నారు. దానికింద ఫార్మల్ ప్యాంట్, షర్ట్ ధరించి ఎవరు ఇలా డ్యాన్స్ చేయగలరు.. అంటూ రాసుకొచ్చారు. ఇదిలాఉండగా.. రామ్‌చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో 'గేమ్‌ఛేంజర్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'రా మచ్చా మచ్చా'... పాటని సోమవారం విడుదల చేశారు. ఈ పాటకి తమన్ స్వరాలు సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. నకాశ్ అజీజ్ ఆలపించారు. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌తో కియారా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, జయరామ్, నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్‌తో పాటు పలువురు కీలక ప్రాతల్లో నటిస్తున్నారు.

# నిలకడగా

# రజనీకాంత్ ఆరోగ్యం



సూపర్ స్టార్ రజనీకాంత్ అస్వస్థతకు గురై ప్రస్తుతం చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వైద్యులు తలైవాకి చిన్నపాటి సర్జరీ చేశారు. అనుభవజ్ఞులైన ముగ్గురు వైద్యులు రజనీకాంత్‌కు పొత్తికడుపు కింది భాగంలో స్టెంట్ వేశారు. ఈ ప్రక్రియ విజయవంతమైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. రెండు లేదా మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. రజనీకాంత్ సోమవారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను చెన్నైలోని అపోలో దవాఖానకు తరలించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీశ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్యుల బృందం సూపర్‌స్టార్‌కు చికిత్స అందిస్తున్నారు. ఇక తలైవా దవాఖానలో చేరిన విషయం తెలుసుకున్న ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రజనీకి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.



## ఆ లెజండరీల గురించి

# నా పిల్లలకు చెబుతా

## - నటి శోభితా ధూళిపాళ్ల ఆసక్తికర పోస్ట్

శోభిత ధూళిపాళ్ల. పేరుకి తెలిగింటి ముద్దుగుమ్మే కానీ హవా నడిపించేది మాత్రం బాలీవుడ్‌లో. అద్భుతమైన కథల ఎంపికతో పాటు తనదైన నటన శైలితో శోభిత తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అక్కినేని నాగ చైతన్యతో ఎంగేజ్మెంట్ తర్వాత ఈ భామ తరుచుగా న్యూస్‌లో కనిపిస్తున్నారు. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియన్ సెల్వన్' సినిమా ఫ్రాంచైజీతో ఆమె మరోసారి నేషనల్ వైడ్‌గా తన యాక్టింగ్ కెపాసిటీని నిరూపించుకున్నారు. 'పొన్నియన్ సెల్వన్-1' సినిమా రిలీజై రెండు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా చిత్ర బృందంతో కలిసి ఆమె సందడి చేశారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒకటి వైరల్ అవుతోంది. తమిళనాడులో అత్యంత సంచలనం సృష్టించిన 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన సినిమా పొన్నియిన్ సెల్వన్. రెండు భాగాలుగా తీర్చిదిద్దిన ఈ సినిమా ఘన విజయం సొంతం చేసుకుంది. తాజాగా ప్రకటించిన ప్రతిష్టాత్మక ఐఫా అవార్డులలో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా విక్రమ్ అవార్డ్ అందుకోగా, క్రిటిక్స్ ఛాయిస్‌లో ఉత్తమ నటిగా ఐశ్వర్యారాయ్ నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ అంతా కలిసి ఫోటో షూట్ నిర్వహించారు. ఈ ఫోటోలను శోభిత ఇన్స్టాలో పోస్ట్ చేస్తూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. ఈ ఫోటోలో హీరో విక్రమ్‌తో పాటు జయం రవి, కార్తి, ఐశ్వర్యారాయ్, త్రిషలతో కలిసి శోభితా ధూళిపాళ్ల ఫొటోలకి పోజ్ ఇవ్వగా 'వీరందరు ఎవెంజర్స్, నా పిల్లలకు వీళ్ల గురించి చెప్తాను' అంటూ ఆమె తన అభిమానాన్ని చాటుకున్నారు. 2016లో బాలీవుడ్ విలక్షణ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన 'రామన్ రాఘవ్ 2.0' చిత్రంతో తెరంగ్రేటం చేసిన శోభిత హిందీ ఇండస్ట్రీలో స్థిరపడిపోయారు. కాగా 2018లో అడివి శేష్ యాక్షన్ స్పై ఫిల్మ్ 'గూఢచారి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 2022లో వచ్చిన పొన్నియన్ సెల్వన్‌తో మరోసారి జాతీయ గుర్తింపు పొందారు. మరోవైపు మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్ వెబ్ సీరీస్‌లతో ఆమె ఓటీటీలోను ప్రత్యేక గుర్తింపు సాధించారు.

# బేబీజాన్ షూట్‌లో పాల్గొననున్న సల్మాన్

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడని తెలిసిందే. ఓ వైపు లీడ్ యాక్టర్‌గా చేస్తూనే.. మరోవైపు కామియో రోల్‌లో కూడా కనిపించబోతున్నాడు. ఈ స్టార్ యాక్టర్ గెస్ట్ రోల్‌లో నటిస్తున్న చిత్రం బేబీ జాన్ నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ బాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్ట్ వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. సల్మాన్ ఖాన్ ఈ మూవీ షూట్‌లో ఎప్పుడు జాయిన్ అవుతాడనే దానిపై ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం అక్టోబర్ మొదటి వారంలో బేబిజాన్ చిత్రీకరణలో జాయిన్ కాబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో వరుణ్ ధవన్, సల్మాన్ ఖాన్‌పై వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేయబోతున్నారట. ఈ సినిమాను డిసెంబర్ 25న ప్రపంచవాప్తంగా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో వామికా గబ్బి మరో హీరోయిన్‌గా నటిస్తోంది. బేబిజాన్ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సినీ1 స్టూడియోస్, జియో స్టూడియోస్‌తో కలిసి ప్రియాఅట్లీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.



# కల్తీపై నిఘా కరువు

- విషతుల్యమవుతున్న నిత్యావసర వస్తువులు
- హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పెరిగిన కల్తీ వస్తువుల వినియోగం
- నూనె, పాలు, పండ్లు కూడా అతీతం కాదు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బియ్యం పిండికి రంగు కలిపితే అది పసుపు, పాల పొడిలో నీళ్లు కలిపితే చిక్కటి పాలు, అరటికాడ గుజ్జుతో అల్లం వెల్లులి పేస్టు, రసాయనాలు రుద్దితే నిగనిగలాడే పండ్లు, నాణ్యతలేని నూనెతో బిర్యానీ, నుడుల్స్, నాన్ వెజ్ వేపుళ్లు, ఇలా చెప్పుకుంటు పోతే కల్తీ కలర్ పూసుకున్న తినుబండారాలను నోరూరించుకుంటు తింటున్నాం. ఇదంతా ఎక్కడో కాదు, అంతటా విచ్చలవిడిగా జరుగుతున్న కల్తీ సరుకుల దందా, జీరో దందాలో ఆహార సరుకులు తయారు చేస్తు ప్రజలను మోసం చేస్తున్నారు కొందరు వ్యాపారులు. మెరిసేదంతా బంగారం కాదు అన్నట్లు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో కాదేది కల్తీకి అనర్హం అన్నట్లు కల్తీ వస్తువులు మార్కెట్లను ముంచెతుతున్నాయి.

### తనిఖీలు లేవు - నమూనాల సేకరణ లేదు

ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టి యాదృచ్ఛికంగా నమూనాలు సేకరించాలి. టీ పొడి నుంచి పాల వరకు ఇలా ప్రతీ ఒక్కదానిపై నాణ్యత ప్రమాణాలను పరిశీలించడం, తనిఖీలు చేయడం చేపట్టాలి. ఈ క్రమంలో నెలకు కనీసం 10-12 నమూనాలు తీసి ఎఫ్ఎస్ఎల్(ఫుడ్ సేఫ్టీ ల్యాబోరేటరీకి) పంపించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ హైదరాబాద్ తో పాటు జిల్లాలో ఇలాంటి చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ఇకపోతే ఫిర్యాదులు వెల్లువెత్తిన సమయంలో మినహా అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆడపాదడపా నమూనాలు సేకరించినా వాటి ఫలితాలు వచ్చేసరికి కేసు నీరు గారిపోతుంది.

### పెరిగిన హెూటల్ సంస్కృతి

హైదరాబాద్ మహనగరంతో దీటుగా జిల్లాలో కూడా హెూటల్ కల్చర్ పెరుగుతోంది. ఉద్యోగులు మొదలుకొని రోజు వారి కూలీల వరకు వివిధ పనులపై బయటకు వెళ్లినప్పుడు అవసరాన్ని బట్టి టిఫిన్, భోజనం కోసం హెూటళ్లు, రెస్టారెంట్లను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా ఫాస్ట్‌ఫుడ్ తినేవారు సైతం ఎక్కువవుతున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు రద్దీగా కనిపిస్తున్నాయి. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో కల్తీ వైపు మొగ్గ చూపుతున్నారు. చాలా చోట్ల కనీసం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రంగులను కలుపుతు క్యాన్సర్, గుండెజబ్బుల వంటి ప్రాణాంతకమైన రోగాలకు కారణమవుతున్నారు. మరికొంత మంది అయితే మాంసం విక్రయాలు చేసే వారితో భేరం కుదుర్చుకుని రోగాలతో లేదా గాయాలపాలైన చనిపోయిన మేకలు కోళ్ళను తక్కువ ధరకు కొని వ్యాపారాలు చేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని పలువురు హెూటల్ నిర్వాహకులు నాసిరకం పదార్థాలతో వంటలు చేసి ప్రజలకు అంటగడుతున్నారు.

### ఆహార సలహా సంఘాలు ఎక్కడ

వినియోగదారులను మోసాల భారి నుంచి రక్షిస్తు వారిలో చైతన్యం నింపేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఆహార సలహా సంఘాలు నిర్వీర్యమయ్యాయి. ఈ సంఘాల సభ్యులు కల్తీలు, మోసాలను అరికట్టేందుకు మూడు నెలలకొకసారి అధికారులతో సమావేశమై తగిన చర్యలు తీసుకోవాలి. అధికారుల నిఘా కొరవడి, వీటి ఏర్పాటును సైతం పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆటగా మారిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### ఆహార పదార్థాలలో కల్తీ

నిత్యావసర వస్తువులలో అనవసర పదార్థాలను కలిపి చలామణీ చేయడం ఒక పెద్ద నేరం. ఈ కల్తీ వలన కొన్నిసార్లు ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుంది.ఆహార కల్తీ విపణిలో ఏ వస్తువుకు డిమాండ్ ఉంటుందో ఏ వస్తువుకు ధర ఎక్కువగా ఉంటుందో ఆ వస్తువు కల్తీ అవడానికి అవకాశాలెక్కువ ఉంటాయి. నూనె, పాలు, నెయ్యి, కారం, పప్పు దినుసులను ఎక్కువగా కల్తీ చేస్తున్నారు. వీటిలో ప్రమాదకరమైన రంగులేసి అమ్ముతుంటారు.

### వంటనూనెల్లో కల్తీ

బ్లెండెడ్ వెజిటెబుల్ ఆయిల్ పేరుతో రెండు రకాల నూనెలను కలిపి విక్రయిస్తారు. బ్లెండెడ్ అనే పదాన్ని చాలా చిన్నగా ముద్రించి అమ్ముతుంటారు. ఉదాహరణకు వేరుశెనగ నూనె (80శాతం), పామాయిల్ (20 శాతం)ను కలిపి ఒక కిలో ప్యాకెట్ చేస్తే ఏది ఎంత మోతాదులో ఉందో స్పష్టంగా కనిపించేలా ముద్రించాలి. కానీ ఉత్పత్తిదారులు తక్కువ ధర ఉన్న నూనెను ఎక్కువ మోతాదులో కలిపి ఆ వివరాలేవీ కనిపించకుండా వేరు శెనగల బొమ్మలను పెద్దగా ముద్రిస్తారు. దీంతో వినియోగదారు ఆర్థికంగా నష్టపోవడమే కాక ఆర్యోగ్యాలను పాడుచేసుకుంటున్నారు.

### పప్పుల కల్తీ

పాత పప్పును విక్రయించడానికి ఉత్పత్తిదారులు మిఠాయిలో వాడే రంగులను పప్పుల్లో కలుపుతారు. దీంతో చేతుల్లోంచి జారిపోతు నిగనిగలాడే పప్పును చూసి ఇది నాణ్యమైనదనుకొని వినియోగదారులు కొంటుంటారు. నిజానికి నాణ్యమైన పప్పు అంతగా మెరవదు. మినపప్పు విషయంలోను టాల్కం పౌడర్‌ను వాడుతుంటారు. మినపప్పును చేతుల్లోకి తీసుకుంటే చేతికి పిండి తగిలితే అదీ కల్తీనే అని భావించాలి.

### కారం కల్తీ


మిరపకాయల్లో తెల్లని, పనికిరాని వాటిని పొడిచేసే క్రమంలో దానికి ఎరుపు రంగు రావడానికి 'సూడాన్' రంగులు వాడి కరంపోడిని కల్తీ చేస్తున్నారు.

### అనారోగ్య సమస్యలు

వ్యాపారస్తులు స్వార్థంతో ఆహారా పదార్థాలను కల్తీ చేసి ప్రజారోగ్యం దెబ్బతీస్తున్నారు. కల్తీ ఆహారం వల్ల దీర్ఘకాలంలో మధుమేహం, అధిక రక్తపోటు వంటి అనారోగ్య సమస్యలు చుట్టుముడుతుండడమే కాక జీర్ణకోశ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు దారితీస్తుంది. రోడ్డు పక్కన ఆహారాలను సాధ్యమైనంత వరకు తినకపోవడమే మంచిదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

# నగరవాసులను వణికిస్తున్న RB-X గుర్తు

## - అసలేంటి మార్క్..




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరవాసులు ప్రస్తుతం బుల్డోజర్ శబ్దం విన్నా.. కాలనీల్లో జేసీబీలను చూసినా వణికిపోతున్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలకు సమీపంలో ఉండే ఇళ్ల యజమానులకైతే నిద్ర కూడా పట్టటం లేదు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తుండటంతో వారి గుండెల్లో రైళ్లు పరుగులు పెడుతున్నాయి. తాజాగా నగరంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారికి కొత్త భయం పట్టుకుంది. ఆర్బి-ఎక్స్ గుర్తు చూస్తే చాలా ఆయా ప్రాంతాల్లోని నగరవాసులు వణికిపోతున్నారు. మూసీని రివర్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించటంతో పాటు ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలకు కొత్త రూపు తీసుకురానున్నారు. ప్రస్తుతం కాలుష్య కోరల్లో చిక్కుకున్న మూసీలో మంచి నీరు పారేలా.. చేసేందుకు రేవంత్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పరివాహక ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేయాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా సర్వే నిర్వించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు పునరావసం కల్పించాలని భావిస్తున్నారు. తాజాగా రెవెన్యూ అధికారులు మూసీ పరివాహకం ప్రాంతాల్లో ఉండే ఇండ్లకు ఆర్బి-ఎక్స్ అనే గుర్తును వేస్తున్నారు. సర్వే నిర్వహించి ఆయా ఇండ్లకు ఈ గుర్తును వేస్తున్నారు. అధికారులు సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో వచ్చే ఇండ్లకు ఆర్బి-ఎక్స్ పేరుతో గుర్తును వేస్తున్నారు. ఆర్బి-ఎక్స్ అంటే రివర్ బెడ్ ఎక్స్ట్రీమ్ అంటే పునరావాసం కల్పించాల్సిన ఇల్లు అని ఆ గుర్తు అర్థం. అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు.

ఈ సర్వేలో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని వారిని ఖాళీ చేయించి ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకోసం ఇప్పటికే జీఓ సైతం జారీ చేసింది. అయితే ఆయా డబుల్ బెడ్ రూం ఇండ్లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి అలాంటి ఇళ్లపై ఆర్బి-ఎక్స్ అని రాస్తున్నారు. ప్రస్తుతం ఈ గుర్తును చూస్తే చాలు మూసీ నది పరివాహక ప్రాంతాల్లోని నగర ప్రజలు వణికపోతున్నారు. ఇండ్లను కూల్చి తమను ఇక్కడి నుంచి తరలిస్తారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా గుర్తులు వేసి పోలీస్ బందోబస్తుతో తమ ఇళ్లను కూల్చేస్తారని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్‌ను తెచ్చిందే బీఆర్ఎస్

- మూసీలో అక్రమ కట్టడాలను గుర్తించాలని కేసీఆర్ ఆదేశించలేదా?
- మూసీ ప్రక్షాళనపై విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయి - మంత్రి శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** మూసీ ప్రక్షాళన విషయమై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలకు మంత్రి శ్రీధర్ బాబు గట్టి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల తీరును తప్పుబట్టారు. 'మూసీ ప్రక్షాళనపై విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ను తెచ్చిందే బీఆర్ఎస్ సర్కారు. మూసీలో అక్రమ కట్టడాలను గుర్తించాలని గతంలో కేసీఆర్ ఆదేశించలేదా?. మూసీని కాలుష్య రహితంగా చేయాలని కేసీఆర్ చెప్పలేదా? గతంలో బీఆర్ఎస్ నేతలు చేసిన పనులను మరిచిపోయినట్లున్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. 2021లో మూసీపై బీఆర్ఎస్ ప్రభుత్వం సమావేశాలు నిర్వహించింది. మూసీకి 50 మీటర్ల దూరంలో బఫర్ జోన్ ను నిర్ణయించారు. మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. బీఆర్ఎస్ హయాంలోనే మూసీ సరిహద్దులను ఫిక్స్ చేశారు. ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకంటూ బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. విశ్వనగరం అనే పేరులోనే కాక కార్యాచరణ చేపట్టాలని మా ప్రభుత్వం ఆలోచిస్తుంది' అంటూ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.



# మూసీ ఇళ్ల కూల్చివేత మొదలు

- ఖాళీ చేసిన వారి ఇళ్ల కూల్చివేత ప్రారంభం
- పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగుతున్న పనులు
- ఖాళీ చేసిన వారిని డబుల్ ఇళ్లకు తరలింపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** మూసీ పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలు మొదలయ్యాయి. చాదర్‌ఘాట్ శంకర్ నగర్ బస్తీలో కూల్చివేతలను మంగళవారం ఉదయం అధికారులు ప్రారంభించారు. ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీగా పోలీసులను మోహరించారు. దాదాపు 140 ఇళ్లు ఖాళీ అయ్యాయి. ఇళ్లు ఖాళీ చేసిన వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించినట్లు సమాచారం. ఈ క్రమంలో మలక్‌పేట పరిధిలోని శంకర్‌నగర్‌లో మూసీ రివర్‌బెడ్‌లోని ఇళ్ల కూల్చివేతలను అధికారులు చేపట్టారు. ఇక్కడ స్వచ్ఛందంగా ఖాళీ చేసిన నిర్వాసితుల ఇళ్లను కూల్చివేస్తున్నారు. వీధులు ఇరుకుగా ఉండటంతో కూలీల సహాయంతో కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. నిర్వాసితులను రెండు పడక గదుల ఇళ్లకు తరలిస్తున్నారు. నిర్వాసితుల సామగ్రి తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేశారు. మరోవైపు అంబర్‌పేట్ నియోజకవర్గం గోల్నాక డివిజన్ తులసి రామ్ నగర్‌లో మూసీ పరివాహక ప్రాంత వాసులను భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించనున్నారు. ఈ కూల్చివేతలపై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. మా ఇళ్లు కూల్చడానికి మీరు ఎవరు..? ఇళ్లు కూల్చి ఇక్కడ పార్కులు కడతారా..? అని ప్రశ్నించారు. కాగా.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది.అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై గుర్తులు వేశారు. కాగా... ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపై పెద్ద అక్షరాలతో పెయింట్ వేసిన విషయం తెలిసిందే. అయితే తమ ఇళ్లను కూల్చి వేస్తారంటూ ఆందోళన చెందిన స్థానిక ప్రజలను అధికారులపై తిరగబడ్డారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పలువురు స్థానికులు ఆందోళనకు దిగారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చివరకు భారీ పోలీసులు భద్రత నడుమ రెవెన్యూ అధికారులు ఇళ్లపై మార్క్ వేశారు. ప్రస్తుతం మరికొన్ని ప్రాంతాల్లో కూడా మార్క్ సర్వే ను అధికారులు కొనసాగిస్తున్నారు. పోలీసు భద్రత మధ్యే ఈ సర్వే సాగుతోంది. కూల్చివేయాల్సిన ఇళ్లకు అధికారులు మార్క్ వేస్తున్నారు. అక్కడి ప్రజలు ఇళ్లు ఖాళీ చేసిన వెంటనే అధికారులు ఆ ఇళ్లను కూల్చివేయనున్నారు.

# బిజెపి దీక్షతో కాంగ్రెస్‌లో భయం

- ఇందిరాపార్క్ వద్ద దీక్షలో ఎంపి అర్వింద్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** బీజేపీ చేపట్టిన రైతుదీక్షతో కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం పట్టుకుందని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. ఇందిరాపార్క్ వద్ద బీజేపీ రైతు దీక్ష కొనసాగుతోంది. బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ 24 గంటల నిరంతర దీక్షలో ఉన్నారు. వీరి దీక్షకు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. మంగళవారం ఉదయం ఇందిరాపార్క్ వద్దకు చేరుకున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ దీక్షకు మద్దతుతెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీక్షపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారని... ఆయనకు వయసు మీద పడిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రాంతీయ పంటలను విస్మరించారని.. ఇప్పుడు రేవంత్ అదే ఫాలో అవుతున్నారని మండిపడ్డారు. హైడ్రాపై హైకోర్ట్ మొట్టి కాయలు వేసిందన్నారు. ముస్లింల ఇండ్లను ముట్టుకోలేదు. చుట్టాలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నేతలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ టార్గెట్ అంతా హిందువులే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరించడం , బ్లాక్ మెయిల్ చేయడం రేవంత్ నైజమన్నారు. 2 పంటలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయం చేశారన్నారు. గుజరాత్ ఆదాయం మోదీ హయాంలో ఎంత పెరిగిందో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పైసలు ఎలా సంపాదించాలనే ధ్యాసనే ఉందంటూ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్‌లు చేసి జైళ్లల్లోకి వెళ్లారన్నారు. కేసీఆర్ శకం ముగిసిందని.. వచ్చే ఎన్నికల్లో ఉంటాడో పీకుతాడో తెలియదంటూ కామెంట్స్ చేశారు. కేటీఆర్, కవితల మోసం చూసి ఎవ్వరూ కూడా ఓటు వేయరన్నారు. మొన్నటి వరకు ముసలోడు కేసీఆర్ ఉండే ఇప్పుడు ఆయన వయస్సు 74. ఇక ఇతనితో ఏం కాదు అంటూ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాగా... రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిర పార్క్ వద్ద 24 గంటలుగా బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ నిరంతర దీక్ష చేస్తున్నారు. రుణమాఫీ సగంమందికి కూడా పూర్తి చేయలేదని బీజేపీ ఆరోపిస్తోంది. వెంటనే అందరికీ 2 లక్షల రుణమాఫీ చేయాలని కమలం పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రైతు భరోసా, బోనస్ కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. బీజేపీ దీక్షపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాఫీ చేశారా అని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం రైతుల ఆదాయం రెట్టింపు చేసిందా అని మంత్రి తుమ్మల అడిగారు. మంత్రి తుమ్మల వ్యాఖ్యలకు మహేశ్వర రెడ్డి, ఈటల కౌంటర్ ఇవ్వనున్నారు. ఈరోజు ఉదయం 11 గంటలకు 24 గంటల దీక్షను బీజేపీ నేతలు విరమించనున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588